ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 228 బుధవారం 05 - 08 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 228 Wednesday 05 - 08 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## పదేళ్ల పాలనలో బీఆర్ఎస్
# రాష్ట్రాన్ని పట్టించుకోలేదు

- మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు
- బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు
- జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్
- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్
- తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య



**వార్త సంధ్య, హైదరాబాద్, ఆగస్టు 04 :** బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు.జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు.పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

- మిగతా 2 లో



## నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?

- బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సవాల్
- ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్
- విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి అంటూ విమర్శలు
- రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని వ్యాఖ్య

**వార్త సంధ్య, హైదరాబాద్, ఆగస్టు 04 :** ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్

- మిగతా 2 లో

## ఏ నియోజకవర్గానికైనా
# స్థానిక ఎమ్మెల్యేనే బాస్



2 లో

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి
- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

## పాక్ ఆక్రమిత
# కశ్మీర్‌లో రక్తపాతం



- పాక్‌పై అంతర్జాతీయ సంస్థల ఆగ్రహం
- పీవోకే ఎన్నికల వేళ పెరిగిపోయిన హింస, అశాంతి
- జర్నలిస్టుల అదృశ్యంపై వెల్లువెత్తిన విమర్శలు
- నిరసనల్లో ఇప్పటివరకు 80 మంది మృతి చెందినట్లు వెల్లడి
- ఇంటర్నెట్ సేవల నిలిపివేత, మీడియాపై తీవ్ర ఆంక్షలు

## 36 దేశాల నుంచి 274 మంది నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం



2 లో

- ఆపరేషన్ త్రిశూల్
- రూ. 17874 కోట్ల ఆస్తులు జప్తు!
- 36 దేశాల నుంచి 274 మంది పరారీలోని నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం
- 2019 నుంచి 2026 వరకు డేటా విడుదల చేసిన హోం శాఖ
- రూ. 17,874 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్

**వార్త సంధ్య,ఢిల్లీ, ఆగస్టు 04 :** దేశం విడిచి పారిపోయిన నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నట్లు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. 2019 నుంచి 2026 వరకు మొత్తం 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వీరిలో ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు, హత్యలు, అత్యాచారాలు పోక్సో చట్టం కింద నేరాలకు పాల్పడిన వారు కూడా ఉన్నారని తెలిపింది. ఇదే సమయంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద పరారీలో ఉన్న నేరస్థులకు చెందిన సుమారు రూ. 17874 కోట్ల విలువైన ఆస్తుల్ని ప్రభుత్వ ఏజెన్సీలు అటాచ్ (జప్తు) చేసినట్లు హోం శాఖ స్పష్టం చేసింది. పరారైన ఆర్థిక నేరగాళ్లకు (ఫ్యూగిటివ్ ఎకనామిక్ అఫెండర్స్) సంబంధించిన కేసుల్లో రూ. 18762 కోట్లను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు

- మిగతా 2 లో

## ఉదయనిధికి హైకోర్టులో ఊరట
# బెయిల్ మంజూరు



- ఉదయనిధికి మద్రాస్ హైకోర్టు బెయిల్
- విడుదల చేయాలని పోలీసులకు ఆదేశం
- విచారణకు సహకరించాలని కోర్టు సూచన
- రిమాండ్‌కు పంపే ఆలోచన లేదన్న పోలీసులు
- ఎఫ్ఐఆర్ నేపథ్యంలోనే విచారణ చేపట్టినట్లు వెల్లడి
- విచారణ పూర్తికాగానే విడుదల చేస్తామన్న పోలీసులు

**వార్త సంధ్య,చెన్నై, ఆగస్టు 04 :** తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈరోజే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది.ముఖ్యమంత్రి విజయ్, సినీ నటి త్రిషకు సంబంధించిన వ్యాఖ్యల ఆరోపణల కేసులో ఈరోజు పోలీసులు ఉదయనిధిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు.ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తైన వెంటనే విడుదల చేస్తామని కూడా వెల్లడించారు.

- మిగతా 2 లో



## పోటెత్తుతున్న వరద.. వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్

- ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద
- శ్రీశైలం జలాశయంలో ఈ సాయంత్రానికి 100 టీఎంసీలకు చేరనున్న నీటి నిల్వలు
- నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు

**వార్త సంధ్య, అమరావతి, ఆగస్టు 04 :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన

- మిగతా 2 లో

## గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు
# శాశ్వత పరిష్కారం



- ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు
- తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం
- నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్

**వార్త సంధ్య, అమరావతి, ఆగస్టు 04 :** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

- మిగతా 2 లో

# పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచింది
- భయంకర పరిస్థితులు, ఒక విప్లవం కారణంగా 57 శాతం ఓట్లు వచ్చాయి
- రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందన్న సీఎం చంద్రబాబు
- 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు



**వార్త సంధ్య, అమరావతి, ఆగస్టు 04 :** రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు.ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం

- మిగతా 2 లో

# సంపాదకీయం

## ఉన్నత విద్య సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలి

(హెచ్.ప్రతాప్)

ఒక దేశ భవిష్యత్తును నిర్మించేది సహజ వనరులు కాదు, మానవ వనరులు. ఆ మానవ వనరులను జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకతతో తీర్చిదిద్దేది ఉన్నత విద్య. అందువల్ల ఉన్నత విద్యను కొద్దిమందికి పరిమితం చేయకుండా ప్రతి సామాన్య విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావడం భారతదేశ అభివృద్ధికి అత్యంత కీలకం. అయితే నేడు గ్రామీణ ప్రాంతాలు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిమితులు, అధిక ఫీజులు, వసతి సమస్యలు, నాణ్యమైన విద్యాసంస్థల కొరత వంటి కారణాలతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇది వ్యక్తిగత నష్టమే కాదు, దేశ ప్రతిభకు కూడా పెద్ద లోటు.భారతదేశంలో ఉన్నత విద్యా స్థూల ప్రవేశ నిష్పత్తి గత కొన్నేళ్లలో పెరుగుతున్నప్పటికీ, అది ఇంకా అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకోలేదు. జాతీయ విద్యా విధానం--2020 ప్రకారం 2035 నాటికి ఈ నిష్పత్తిని 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. అఖిల భారత ఉన్నత విద్యా సర్వే ప్రకారం ప్రస్తుతం ఈ నిష్పత్తి సుమారు 28 శాతం మాత్రమే ఉంది. అంటే పాఠశాల విద్య పూర్తిచేసిన యువతలో గణనీయమైన వర్గం ఉన్నత విద్యలోకి ప్రవేశించలేకపోతోందని అర్థం. ఈ పరిస్థితి మారకపోతే ప్రపంచ జ్ఞాన ఆర్థిక వ్యవస్థలో భారత్ తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించడం కష్టమవుతుంది.ప్రస్తుతం ప్రైవేటు విద్యాసంస్థల్లో పెరుగుతున్న ఫీజులు సామాన్య కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. చాలామంది విద్యార్థులు విద్యా రుణాలపై ఆధారపడడం లేదా చదువును మధ్యలోనే నిలిపివేయడం వంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రతిభకు బదులుగా ఆర్థిక స్థితి విద్యను నిర్ణయించే పరిస్థితి ఏర్పడితే సామాజిక అసమానతలు మరింత తీవ్రమవుతాయి. విద్య ఒక వస్తువు కాదు; అది ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించే రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతీక.గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్, నర్సింగ్, వృత్తి విద్యా కేంద్రాలను మరింత బలోపేతం చేయాలి. డిజిటల్ విద్యా వేదికలను విస్తరించి ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఆన్‌లైన్ బోధన, డిజిటల్ గ్రంథాలయాలు, వర్చువల్ ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థి వసతి గృహాలు, సురక్షిత రవాణా, విస్తృత ఉపకార వేతనాలు, తక్కువ వడ్డీతో విద్యా రుణాలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి చర్యలు ఉన్నత విద్యలో ప్రవేశాన్ని గణనీయంగా పెంచగలవు.అదేవిధంగా ఉన్నత విద్య కేవలం డిగ్రీల ప్రదానానికి పరిమితం కాకుండా ఉపాధి అవకాశాలను పెంపొందించేలా ఉండాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను నవీకరించడం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నవకల్పన, స్టార్టప్‌ల ప్రోత్సాహం, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం అత్యవసరం. విద్యార్థులు ఉద్యోగాలు వెతికే వారిగానే కాకుండా ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి విద్య దోహదపడాలి.మహిళలు, దివ్యాంగులు, గిరిజన ప్రాంతాల విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక విద్యా మద్దతు అందించడం కూడా సమానంగా ముఖ్యం. భాషా అవరోధాలు, ప్రాంతీయ అసమానతలు, డిజిటల్ అంతరాలను తగ్గించే విధానాలు అమలు చేయాలి. మాతృభాషలో నాణ్యమైన ఉన్నత విద్యా బోధనకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామీణ విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అంతేకాకుండా ప్రతి జిల్లాలో పరిశోధనా కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి హబ్‌లు, కెరీర్ మార్గదర్శక కేంద్రాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను సొంతం చేసుకునే సామర్థ్యాన్ని పొందుతారు.భారత్ ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభా దేశానికి జనాభా లాభాంశంగా మారాలంటే ఉన్నత విద్య అందరికీ చేరువ కావాలి. నైపుణ్యం కలిగిన యువత పెరిగితే దేశ ఉత్పాదకత పెరుగుతుంది, నిరుద్యోగం తగ్గుతుంది, పరిశోధనలకు ఊతం లభిస్తుంది, ఆవిష్కరణలు పెరుగుతాయి. ప్రపంచ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు, విదేశీ విద్యా అవకాశాలు, పరిశోధన నిధులు పెరగడం ద్వారా భారత ఉన్నత విద్యా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో మరింత పోటీతత్వాన్ని సంతరించుకుంటుంది.విద్యపై చేసే వ్యయం ఖర్చు కాదు; అది దేశ భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి. సామాన్యుడి ఇంటి గడప దాటి ఉన్నత విద్య చేరినప్పుడే ప్రతిభకు నిజమైన గుర్తింపు లభిస్తుంది. జ్ఞానసమాజ నిర్మాణం, ఆర్థిక పురోగతి, సామాజిక సమానత్వం, ప్రపంచ పోటీలో భారత స్థానం మరింత బలపడాలంటే ఉన్నత విద్య ప్రతి యువకుడికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. “ప్రతి ప్రతిభావంతుడికి అవకాశమే అసలైన సమానత్వం” అనే సూత్రాన్ని ఆచరణలో పెట్టినప్పుడే అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతాయి. అదే నిజమైన వికసిత భారతానికి పునాది అవుతుంది.

## గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి -** పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

## పోటెత్తుతున్న వరద.. వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్

**మొదటిపేజీ తరువాయి -** సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు.శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు.ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

## పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రక్తపాతం



**మొదటిపేజీ తరువాయి -** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ తీవ్ర హింస, అశాంతి చోటుచేసుకుంటున్నాయి. నిరసనకారులపై పాక్ భద్రతా బలగాలు దాడులకు పాల్పడటం, మీడియాపై ఉక్కుపాదం మోపడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే దర్యాప్తు జరపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.రావల్ కోట్‌లో నిరసనకారులపై భద్రతా బలగాలు విచక్షణారహితంగా వ్యవహరించాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది. ఈ ఘటనలపై స్వతంత్ర విచారణ జరిపించాలని, నిలిపివేసిన ఇంటర్నెట్, మొబైల్ సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరింది. స్వతంత్ర పరిశీలకులను, మీడియాను ఆ ప్రాంతంలోకి అనుమతించాలని డిమాండ్ చేసింది.పీవోకేలో పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేస్తున్నారని సీపీజే ఆరోపించింది. ఆగస్టు 1న ఇస్లామాబాద్‌లో జర్నలిస్టులు రాజీ తాహిర్, మహమ్మద్ సైఫ్‌లను పోలీసు దుస్తుల్లో ఉన్న వ్యక్తులు అపహరించారని, వారి ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని తెలిపింది. మరో జర్నలిస్ట్ రాజా ఇక్రామ్‌ను నిర్బంధించి, ఆ తర్వాత విడుదల చేశారని పేర్కొంది. జర్నలిస్టులను అక్రమంగా నిర్బంధిస్తే తక్షణమే విడుదల చేయాలని పాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ నిరసనల్లో మృతుల సంఖ్య పెరుగుతోందని ‘హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ పీవోజేకే’ వెల్లడించింది. ఆదివారం నాటికి రావల్ కోట్, మీర్‌పూర్, ముజఫరాబాద్‌లలో జరిగిన హింసాత్మక ఘటనల్లో మొత్తం 80 మంది మరణించారని, వీరిలో నలుగురు పోలీసులు కూడా ఉన్నారని తన నివేదికలో పేర్కొంది.

# పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల



**మొదటిపేజీ తరువాయి -** పేర్కొన్నారు.‘సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుంది. జీవన ప్రమాణాలు పెంచగలిగితేనే ప్రభుత్వానికి సంతృప్తి. సమాజంలో మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. దీనివల్ల 2.4 లక్షల కుటుంబాలకు సాయం అందుతోంది. ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా పని చేస్తున్నాం. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. మార్గదర్శి-బంగారు కుటుంబం నినాదం తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ, మైనారిటీలకు పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు వినియోగించు కుంటున్నాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.పాలన బాగుంటే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటం అవుతాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తు న్నామన్నారు. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉండేదని, విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104, ఏపీలో తలసరి ఆదాయం రూ.93,903 అని వివరించారు. ఈ పరిస్థితుల నుంచి సీఏజీఆర్ 13.5 శాతం వృద్ధి స్థాయికి చేరామన్నారు. 2019-24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గిందని, వృద్ధిరేటు తగ్గడంతో రూ.6.94లక్షల కోట్ల నష్టం జరిగిందని సీఎం వివరించారు.పొదుపు చేశాం: వైఎస్సార్సీపీ పాలనలో నీతి ఆయోగ్ నివేదిక చూస్తే జరిగిన ఆర్థిక విధ్వంసం తేటతెల్లం అవుతోందని సీఎం అన్నారు. పెండింగ్ బిల్లులు రూ.48,616 కోట్లు ఉంటే దానిని రూ.29,259 కోట్లకు తగ్గించాగలిగామని సీఎం స్పష్టం చేశారు. 370లోన్లపై చర్చలు జరిపి 1100 కోట్లు ఆదా చెయ్యగలిగామని మెత్తంగా రూ. 8600 కోట్లు పొదుపు చేశామని ముఖ్యమంత్రి వివరించారు.రాష్ట్రంలో భయం కరమైన పరిస్థితులు ఉండేవని సీఎం అన్నారు. ఒక విప్లవం కారణంగా 57 శాతం ఓట్లు వచ్చాయని, 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచిందని అన్నారు. గొడవలు పడితే సాధించేది ఏమీ ఉండదని, కష్టపడి పనిచేస్తే ఫలితం పది రెట్లు ఉంటుందన్నారు. 2019 వైఎస్సార్సీపీ పాలనలో సంస్థలు రాలేదని వారి హయాంలో బ్రాండ్ ఆంధ్రా దెబ్బతిందని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు అంటే షాక్‌కు గురయ్యామని ఎద్దేవా చేశారు.

# 36 దేశాల నుంచి 274 మంది నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి -**
వివరించింది.హోం శాఖ గణాంకాల ప్రకారం అత్యధికంగా 2025లో పరారీలో ఉన్న 70 మంది నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చారు. 2026లో చూస్తే జులై వరకే ఏకంగా 45 మంది అప్పగింత పూర్తయింది. అంతకుముందు 2024 సంవత్సరంలో 43 మంది, 2023లో 37 మంది, 2022లో 40, 2021లో 23, 2020లో ఏడుగురు, 2019లో 9 మందిని భారత్‌కు తీసుకువచ్చినట్లు పేర్కొంది.భారత్‌కు రప్పించిన 274 మంది పరారైన నేరస్థులు వివిధ రకాల దారుణమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరిలో 62 మంది హత్యలు, దోపిడీలు, హింసాత్మక నేరాల్లో నిందితులుగా ఉండగా, 53 మంది అత్యాచారాలు, పోక్సో కేసుల్లో; 42 మంది గ్యాంగ్‌స్టర్ కార్యకలాపాల్లో; 18 మంది మానవ అక్రమ రవాణా, కిడ్నాప్ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. మరో 17 మంది ఉగ్రవాదం, దేశద్రోహం, నార్కో టెర్రర్ కేసుల్లో; 16 మంది డ్రగ్స్, చీటింగ్ కేసుల్లో నేరస్థులుగా ఉన్నారు. స్మగ్లింగ్, నకిలీ కరెన్సీ, సైబర్ నేరాల్లో 12 మంది, ఆర్థిక మోసాల కేసుల్లో 9 మంది నిందితులుగా ఉన్నారు.పరారీలోని నేరస్థుల్ని గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ త్రిశూల్ చేపట్టింది. ఇక్కడ శాటిలైట్ లొకేషన్ వివరాలు, డిజిటల్ ఫుట్‌ప్రింట్లు, నిఘా వ్యవస్థల ఆధునిక సాంకేతికత సహాయంతో విదేశాల్లో పేర్లు, గుర్తింపులు మార్చుకొని దాక్కున్న నిందితుల్ని గుర్తించగలిగామని తెలిపింది. సీబీఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో, రా ,విదేశాంగ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ , రాష్ట్ర పోలీసు శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేసింది. దీనిని హోల్ ఆఫ్ గవర్న్‌మెంట్ విధానంగా అభివర్ణించింది.ఇంకా ఇంటర్‌పోల్ సహకారంతో గత మూడేళ్ల కాలంలో 501 కంటే ఎక్కువగా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, 2026లోనే ఇప్పటివరకు 182 నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు దేశంలోని 1400 కంటే ఎక్కువ పోలీస్ ఏజెన్సీలను ఇంటర్‌పోల్‌తో అనుసంధానించేందుకు భారత్‌పోల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దీని ద్వారా అంతర్జాతీయంగా సమాచార మార్పిడి సమయం గణనీయంగా తగ్గింది.అమెరికా నుంచి 26/11 ముంబయి దాడి నిందితుడు తహవ్వూర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తీసుకురావడం దేశం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని హోం శాఖ పేర్కొంది. క్లిష్టమైన ఉగ్రవాద కేసుల్లో భారత్ అనుసరించిన న్యాయపరమైన, దౌత్యపరమైన ప్రయత్నాలకు ఇది ఉదాహరణగా నిలిచిందని తెలిపింది. జమ్ముకశ్మీర్‌లో విదేశాల నుంచి నడిచే నార్కో- టెర్రరిజం నెట్‌వర్క్‌లను ఛేదించడంలోనూ ఈ చర్యలు కీలకంగా మారాయని తెలిపింది.పరారీలో ఉన్న నేరస్థులు కేవలం పాత కేసులకే పరిమితం కాదని, వారు దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, శాంతి భద్రతలకు నిరంతర ముప్పుగా ఉంటారని హోం శాఖ స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పరారీలో ఉన్న నేరస్థుల అప్పగింతను జాతీయ ప్రాధాన్యత అంశంగా తీసుకున్నట్లు తెలిపిన హోం శాఖ, ఇందులో భాగంగానే 2018లో ఫ్యూగిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ చట్టాన్ని తీసుకొచ్చినట్లు గుర్తుచేసింది.

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



**మొదటిపేజీ తరువాయి -** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు.తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే ‘ఫస్ట్ బాస్’ అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?



**మొదటిపేజీ తరువాయి -** బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో 18 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు

**తెలంగాణకు ఎల్లో అలర్ట్**

**వారం రోజుల క్రితం 34 శాతంగా ఉన్న లోటు**

**నగరంలో కొన్ని ప్రాంతాల్లో అధిక లోటు,**

**మరికొన్నిచోట్ల అదనపు వర్షపాతం**



తెలంగాణ వ్యాప్తంగా ఆగస్టు 10 వరకు ఎల్లో అలర్ట్ జారీ

గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి గణనీయమైన ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకే రీతిలో లేదు. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్‌లలో 26 శాతం చొప్పున అత్యధిక లోటు నమోదైంది. మరోవైపు, గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం, బహదూర్‌పురాలో 5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ వంటి ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉంది.ఇదిలా ఉండగా, రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆగస్టు 10 వరకు ‘ఎల్లో అలర్ట్’ జారీ చేసింది. ఈ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

**25 టన్నులకు పైగా సరుకు స్వాధీనం**

**13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్**

**ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి**

**కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**



భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఎ-ఫీూరు బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# మంథని పీఏసీఎస్ చైర్మన్ పదవి మిటుకు రామ్మూర్తి ని వరించేనా !



**మంథని, ఆగస్టు 04(వార్త సంధ్య) :** మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పదవి భర్తీపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఇటీవల మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన మిటుకు రాములుకు పీఏసీఎస్ చైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మిటుకు రామ్మూర్తి కుటుంబం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయంగా పనిచేస్తూ వస్తోంది. మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు, ప్రస్తుత మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నాయకత్వంలో కూడా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. మిటుకు రాములు ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన నాయకుడని, మంథని నియోజకవర్గంలో ఆ వర్గం కాంగ్రెస్ పార్టీకి బలమైన అండగా నిలుస్తు న్నప్పటికీ ఇప్పటి వరకు తగిన నామినేటెడ్ పదవులు దక్కలేదనే నిరాశకు లోనవుతున్నారు. ఈసారి పీఏసీఎస్ చైర్మన్ పదవిని మిటుకు రాములుకు కేటాయించడం ద్వారా ఆ సామాజిక వర్గానికి న్యాయం చేసినట్ల వుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పీఏసీఎస్ చైర్మన్ పదవికి మిటుకు రాములు సరైన ఎంపిక అవుతారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆశాభావంతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్స రాలుగా విధేయంగా పనిచేసిన మిటుకు రామ్మూర్తి కి గుర్తింపు దక్కాలని, ముఖ్యంగా ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి ఈసారి అవకాశం కల్పించాలని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును కోరుతున్నారు.

# చిరుమల రాములు కుటుంబానికి బిఆర్ ఎస్ అండగాలి సేవా భావనతోలి బి ఆర్ ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్



**సింగరేణి (కారేపల్లి ) ప్రతినిధి ఆగస్టు 4 (వార్త సంధ్య ) :** సింగరేణి మండలం లో గత వారం మృతి చెందిన చిరుముల రాములు దశదిన కార్య క్రమ నిమిత్తం వారి కుటుంబానికి ఆర్థిక చేయూత నందించిన షేక్ గౌసుద్దీన్. కారేపల్లి మండల కేంద్రం అంబేద్కర్ కాలనీ కి చెందిన చిరుముల రాములు అనారోగ్యంతో గత వారం క్రితం మృతి చెందారు విషయం తెలుసుకున్న చిరుమల రాములు దశదిన కార్యక్రమ నిమిత్తము వారి కుటుంబానికి చెందిన భార్య కి ఎల్లబ్బాయి 5000 రూపాయలు బాధిత కుటుంబానికి టిఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ ఆర్థిక చేయూతను అందించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుమల రాములు మృతి చెందడంతో ఆ కుటుంబం నిరాశ్రయు లయ్యారు . బాధితులకు అండగా నేనున్నానంటూ వారి కుటుంబానికి ఆ దేవుడు ఓదార్పు దయ చేయా లని మంగళవారం వారి వద్దకు వెళ్లి , ఆపద సమయంలో మానవత్వం మంచి మనసున్న మనిషిగా మాకు చేతనందించినందుకు గాను ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు డొంకిన రవీందర్ గౌడ్ పాలిక వీర స్వామి కారేపల్లి మం డలం బీసీ నాయకుడు పేరు వెంకటేశ్వర్లు యువ నాయకు చింతల సంపత్ ఎండి ఖలీలుల్లా ఖాన్ సోమందుల వెంకటేశ్వర్ బి ఆర్ ఎస్ మైనార్టీ యువ నాయకుడు షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలో అభివృద్ధి పై చర్చ - గుంజపడుగు సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్



**మంథని, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో మంగళవారం డిపిడిపి గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ దండెవెన సంధ్య బానేష్ మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు సజావుగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని చర్యలు చేపట్టామని తెలిపారు. ఉమెన్ ఫ్రెండ్లీ , చైల్డ్ ఫ్రెండ్లీ, గుడ్ గవర్నెన్స్, అన్ని విభాగాల్లో గుంజపడుగు గ్రామ పంచాయతీ ముందు ఉండాలని పనులు చేస్తున్నామని, అలాగే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్క లక్ష్మి సదానందం, కార్యదర్శి సతీష్ కుమార్, వార్డు సభ్యులు దొడ్డిపట్ల శంకర్, దేవరకొండ పోచం, దేవుళ్ళ లక్ష్మీ , ఎఎన్ఎం పద్మ, అంగన్వాడి టీచర్లు, స్వరూప,రమాదేవి,కళావతి, వరుణ, స్వరూప మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంథనిలో హైకోర్టు ఆదేశాలు బేఖాతరు..!

## అక్రమ నిర్మాణాలపై సుమోటో గా విచారణ కోరుతూ ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు



**మంథని, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** మంథని పట్టణంలోని అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మండల సత్యనారాయణ రెడ్డితో పాటు షమీమ సుల్తానా, వలకొండ భీమయ్య, సిలేవేని భూమయ్య, డాక్టర్ బుద్దర్తి శ్రీనివాస్, రాచర్ల తిరుమల నాగరాజు, వొల్లాల నవ్య, బగ్గాని రాజేష్, తదితరుల పేర్లు హైకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్నాయి. ఈ నిర్మాణాలకు భవన అనుమతులు లేవని మంథని మున్సిపాలిటీ గుర్తించి 2023లో తొలగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు కోర్టు పత్రాల్లో పేర్కొంది. అనంతరం తెలంగాణ హైకోర్టు కూడా ఆక్రమణలు తొలగించి నాలుగు వారాల్లో అమలు నివేదిక సమర్పించాలని మంథని మున్సిపాలిటీని ఆదేశించింది. అయితే, హైకోర్టు ఆదేశాల తర్వాత కూడా వివాదాస్పద నిర్మాణాలు అలాగే కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ ముస్కుల చంద్రశేఖర్ రెడ్డి ప్రధాన న్యాయమూర్తి (సీజే) కి ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను మంథని మున్సిపాలిటీ ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదని, ఇది కోర్టు ధిక్కరణకు సమానమని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నత న్యాయస్థానం సుమోటో గా విచారణ చేపట్టి, ఆదేశాలు అమలు చేయని అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని, వివాదాస్పద అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని ఫిర్యాదుదారు కోరారు. ఈ వ్యవహారం మంథనిలో తీవ్ర చర్చకు దారితీసింది. హైకోర్టు ఆదేశాల అమలుపై మున్సిపాలిటీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# సింగరేణికే పీకేఓసీ-2 బొగ్గు బ్లాక్... బీజేపీ సంబరాలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** మణుగూరు పీకేఓసీ-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించడాన్ని స్వాగతిస్తూ భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలో సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, పీకేఓసీ-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు సింగరేణి సంస్థ భవిష్యత్తుకు కీలక నిర్ణయమని అన్నారు. వేలం ప్రక్రియలో సింగరేణి, జెన్‌కో మధ్య పోటీ నెలకొన్నప్పటికీ, చివరకు బొగ్గు బ్లాక్ సింగరేణికే దక్కడం కార్మికులు, ఉద్యోగులు, మణుగూరు ప్రాంత ప్రజల విజయంగా అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుతూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఎకరాకు సీతారామ జలాలు అందించాలి : ఎస్.కె. సాబీర్ పాషా

**పెండింగ్ పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలి**

**ఆగస్టు 6 నుంచి 14 వరకు 'ప్రజా చైతన్య యాత్రలు'**

**సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభ**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని, ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని తాటిపల్లి రెసిడెన్సీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 7.80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం కేవలం 2.40 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోందన్నారు. వంద కిలోమీటర్లకు పైగా గ్రావిటీ కాలువలు నిర్మించి ప్రజలను నిర్వాసితులను చేసినప్పటికీ పూర్తి స్థాయిలో సాగునీరు అందించకపోవడం విచారకరమని విమర్శించారు. ఇల్లందు, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లోని చెరువులను నింపి ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, రైతులకు పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 44 కార్మిక చట్టాల మార్పులను రద్దు చేయాలని, విద్య, ఉపాధి హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా చేర్చాలని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 73 వేల ఎకరాల పోడు భూములకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని, కేటీపీఎస్ సమీపంలో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే భద్రాచలానికి ఆనుకుని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని, విద్యా, వైద్య రంగాలను పేదలకు అందు బాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా "ప్రజా చైతన్య యాత్రలు" నిర్వహిస్తున్నామని తెలిపారు. భద్రాద్రి జిల్లాలో ఏడూళ్ల బయ్యారం నుంచి అశ్వారావుపేట వరకు అన్ని మండలాలు, గ్రామాల్లో యాత్రలు చేపడతామని వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో "దేశంలో మార్పు కోసం" భారీ బహిరంగ సభ నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, వి. పూర్ణచందర్ రావు, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, గనగళ్ల వీరాస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్.కె. ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలంలో బెల్ట్ షాపుల దందాపై తీవ్ర ఆరోపణలు

**ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాల పక్కనే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయంటూ స్థానికుల ఆందోళన**

**మద్యం, మత్తు పదార్థాలు, ధూమపానం,వ్యసనాల బారిన పడుతున్న విద్యార్థులు - తల్లిదండ్రుల ఆవేదన**

**ఖరీదైన బ్రాండ్ల ఫుల్ బాటిళ్లలోనూ కల్తీ మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు**

**ఎమ్మార్పీ కంటే రూ.40 నుంచి రూ.70 వరకు అధిక ధరలకు విక్రయాలంటూ వినియోగదారుల ఫిర్యాదులు**

**షెడ్యూల్ ప్రాంతాల్లో చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రజల విజ్ఞప్తి**








**సింగరేణి (కారేపల్లి), ఆగస్టు 4 (వార్త సంధ్య ):** సింగరేణి మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణ యథేచ్ఛగా కొనసాగుతోందని స్థానికులు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, మండలంలోని అనేక గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో సులభంగా లభిస్తున్న కొన్ని ఖరీదైన బ్రాండ్ల మద్యం, అధికారిక వైన్స్ దుకాణాల్లో మాత్రం అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ సరఫరా వ్యవస్థపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా, సీల్ వేసి ఉన్న ఫుల్ బాటిళ్లను ప్రత్యేక నైపుణ్యం కలిగిన వ్యక్తుల ద్వారా అనుమానం రాకుండా తెరిచి, అందులో కల్తీ మద్యం నింపి తిరిగి సీల్స్ వేసి విక్రయిస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఖరీదైన బ్రాండ్ల బాటిళ్లలో కూడా నాసిరకం మద్యం కలిపి విక్రయిస్తున్నారని కొందరు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై నిపుణులతో బాటిళ్లను పరీక్షించి వాస్తవాలను వెలికితీయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వేల రూపాయలు వెచ్చించి ఖరీదైన బ్రాండ్ల మద్యం కొనుగోలు చేసిన కొందరు వినియోగదారులు, మద్యం సేవించిన అనంతరం అస్వస్థతకు గురైనట్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మద్యం నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు, మండలంలోని అనేక గ్రామాల్లో ఎమ్మార్పీ ధరల కంటే రూ.40 నుంచి రూ.60 వరకు అధిక ధరలకు మద్యం విక్రయి స్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

కూలీ పనులు చేసుకుని జీవించే పేద కుటుంబాలపై ఈ అదనపు భారం తీవ్ర ప్రభావం చూపుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణ కారణంగా యువత మద్యానికి బానిసవుతోందని, కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాలు, నివాస ప్రాంతాలకు సమీపంలోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు దీంతో విద్యార్థులు మద్యం, ఇతర మత్తు పదార్థాలు, ధూమపానాల ప్రభావానికి గురవుతున్నారనే ఆందోళనను తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో ఇటువంటి కార్యకలాపాలను సాగించడం వల్ల విద్యార్థులు ధూమపానం విష కాలుష్యాన్ని పీలిస్తూ, మద్యం సేవించిన వారి అల్లర్లు చేయడం పట్ల చదువుకోవడానికి ఇబ్బందిగా ఉందని ఇలాంటి పద్యం దుకాణాలను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. స్థానికులు మరో కీలక అంశాన్ని ప్రస్తావిస్తూ, షెడ్యూల్ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం మరియు పీసా ( పి జి ఎస్ ఏ ) చట్టం నిబంధనలు కట్టుదిట్టంగా అమలవుతున్నాయా అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. ఈ చట్టాల ఉద్దేశానికి విరుద్ధంగా అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లయితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ బెల్ట్ షాపుల వ్యవహారంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా, గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ, కల్తీ మద్యం ఆరోపణలు, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నప్పటికీ బడా నాయకులు, సంబంధిత అధికారులు స్పందించకపోవడం వెనుక కారణాలేమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ బెల్ట్ షాపులను గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు, మద్యం నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కల్తీ మద్యం తయారీ, అక్రమ విక్రయాలు, ఎమ్మార్పీకి మించి ధరలకు విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలు, యువత భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి అక్రమ మద్యం దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రామవరం 16వ డివిజన్‌లో పోకిరీల ఆగడాలు..

**గంజాయి, మద్యం మత్తులో హల్‌చల్.. భయాందోళనలో స్థానికులు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** రామవరం 16వ డివిజన్‌లో కొందరు అసాంఘిక వ్యక్తుల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో ఉన్న ఓ పాడుబడ్డ భవనం గంజాయి సేవించే వారికి, మద్యం సేవించి గుమికూడే వ్యక్తులకు అడ్డాగా మారిందని ఆరోపిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. ప్రతిరోజూ సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కొందరు యువకులు పాడుబడ్డ భవనం వద్ద గుమికూడి గంజాయి, మద్యం సేవిస్తూ నానా హంగామా సృష్టిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మద్యం మత్తులో వీధుల్లో తిరుగుతూ అసభ్య పదజాలంతో మాట్లాడడం, గట్టిగా అరవడం, స్థానికులను భయపెట్టే విధంగా ప్రవర్తించడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపిస్తున్నారు. ఇటీవల మద్యం మత్తులో వీధి దీపాలను ధ్వంసం చేయడంతో రాత్రి వేళల్లో కాలనీలో చీకట్లు అలుముకుని ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అంతేకాకుండా ఇళ్లపై, రోడ్డుపై వెళ్తున్న వారిపై రాళ్లు విసురుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ ఘటనల్లో వృద్ధులకు కూడా గాయాలు తగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలను ప్రశ్నించిన స్థానికులపై దురుసుగా ప్రవర్తిస్తూ, "మా ఇష్టం... ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి", "పోలీసులకు ఫిర్యాదు చేసినా వెంటనే బయటకు వచ్చేస్తాం", "మేమే లీడర్లు... మీకు దిక్కున్న చోట చెప్పండి" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కొంతమందిపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నించారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కౌన్సిలర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోలేదని వారు పేర్కొంటున్నారు. పాడుబడ్డ భవనం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని, దానిని వెంటనే తొలగించడం లేదా పోలీసు పర్యవేక్షణలోకి తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాలనీలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీని పెంచి, గంజాయి, మద్యం సేవిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రశాంతంగా జీవించే హక్కును కాపాడాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను సీపీ సునీల్ దత్ ఆకస్మికంగా తనిఖీ

**పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై ప్రశంసలు**

**- ప్రజలకు సత్వర న్యాయం చేయడమే పోలీసుల తొలి కర్తవ్యమని సూచన**



**సింగరేణి,(కారేపల్లి), ఆగస్టు 4: (వార్త సంధ్య ):** ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ, కార్యాలయాల నిర్వహణ, పరిశుభ్రత, కేసుల రికార్డులు, ఫిర్యాదుల పరిష్కార విధానం, ప్రజలకు అందుతున్న సేవల తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం, రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడం, విధుల పట్ల సిబ్బంది చూపుతున్న అంకితభావంపై సీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించే దశలో కారేపల్లి పోలీసుల స్పందన తీరును అభినందించారు. ఈ సందర్భంగా కారేపల్లి సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి, పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే నిబద్ధతతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.



అనంతరం సీఐ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ, కార్యాలయ నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సీఐ సాగర్ పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యపై వెంటనే స్పందించాలని, ఫిర్యాదులను జాప్యం లేకుండా విచారించి చట్టబద్ధంగా న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని హెచ్చరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే సేవల ద్వారానే పోలీసు శాఖపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. బాధితులకు అండగా నిలవడం, ప్రతి ఫిర్యాదును సున్నితంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులతో ఎమ్మెల్యే కోరం సమావేశం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** ఇల్లందు నూతన మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య పురపాలక కార్యాలయంలో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీసిన ఎమ్మెల్యే, వ్యాపారులందరూ కమిటీ ఏర్పాటు చేసుకుని పరస్పర అంగీకారంతో ఒకే ధర విధానాన్ని అమలు చేయాలని సూచించారు. చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో చిరు వ్యాపారుల కోసం నూతన మార్కెట్ నిర్మించిందని గుర్తుచేసిన ఎమ్మెల్యే, మార్కెట్ చుట్టూ త్వరలోనే షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. అప్పటి వరకు వ్యాపారులందరూ ఐకమత్యంతో వ్యాపారాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో పురపాలక చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, పురపాలక కమిషనర్ సందీప్, టౌన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బోళ్ళ సూర్యం, కో-ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మాజీ టౌన్ అధ్యక్షుడు దొడ్డా డానియల్‌తో పాటు పలువురు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## రైతు సంఘం మండల అధ్యక్షుడిగా ఉపేందర్ రెడ్డి, కార్యదర్శిగా రాజారావు



**గార్ల, ఆగస్టు 04 (వార్త సంధ్య) :** తెలంగాణ రైతు సంఘం గార్ల మండల 9వ మహాసభలో మండల అధ్యక్షుడిగా బొబ్బ ఉపేందర్ రెడ్డి, కార్యదర్శిగా గడ్డిపాటి రాజారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా గుండెటి వీరభద్రం, దారావత్ బుజ్జి, సహాయ కార్యదర్శులుగా చింత ఎల్లయ్య, చింత బాబు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బడిశా లక్ష్మి, కందునూరి మహేశ్వరరావు, గుండా వెంకటరెడ్డి, వై. రామారావు, వి. వీరభద్రం, బి. శ్రీను, పి. బుజ్జి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. అన్ని పంటలకు ఎం. ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని, రైతులకు ప్రకటించిన సమగ్ర రుణమాఫీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే చిన్న, సన్నకారు రైతులకు ఎరువులు, పురుగుమందులు ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలని కోరారు. మండలానికి చుక్క నీరు అందకుండా నిర్మాణం చేపడుతున్న మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి సంబంధించిన జీవోను వెంటనే రద్దు చేయాలని మహాసభ తీర్మానించింది.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య



# గ్రామీణ ప్రజారోగ్యమే ధ్యేయంగా సేవలు అందిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు

**మహాదేవపూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం**

**క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షలు, అద్దాలు పంపిణీ లో**

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు**





**మంథని, మహాదేవపూర్, ఆగస్టు 04( వార్త సంధ్య) :** మంథని నియోజకవర్గంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో, వారి మార్గదర్శకత్వంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు సోదరి, మంథని మాజీ సర్పంచ్ స్వర్గీయ సువర్ణ చంటయ్య సతీమణి స్వర్గీయ సువర్ణ వనమాల (తాయి) స్మారకార్థం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజారోగ్యానికి నిరంతరం ప్రాధాన్యమిచ్చే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ఓమెగా హాస్పిటల్, కరీంనగర్‌కు చెందిన సుషిత హాస్పిటల్ వైద్యులతో పాటు పుష్పగిరి హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరంలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యంగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి నిపుణులైన వైద్యులు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

**మంత్రి శ్రీధర్ బాబు విజన్‌తో ఇంటింటికీ ఉచిత వైద్యం**

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు**

ఈ శిబిరంలో నిర్వహించిన కంటి పరీక్షల్లో అర్హులైన బాధితులకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు ఆలోచనలకు అనుగుణంగా, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను వారి ముంగిటికే చేరవేయాలనే ప్రధాన లక్ష్యంతోనే ఈ ఉచిత వైద్య శిబిరాలను మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. మంత్రి ఆశయాల సాధనలో భాగంగా కాటారం డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 680 మందికి హైదరాబాద్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి వారికి తిరిగి చూపు ప్రాప్తింపజేశామని శ్రీను బాబు వెల్లడించారు. అంతేకాకుండా, మంథని నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో ఇప్పటివరకు సుమారు 45 వేల మందికి ఉచితంగా కంటి పరీక్షలు, చికిత్సలు అందించి ఆరోగ్య భరోసా కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రజలకు మరిన్ని విస్తృత స్థాయి ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తామని శ్రీను బాబు స్పష్టం చేశారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్య బృందాలకు, ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మరియు ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లా మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో మంత్రి వాకిటి శ్రీహరి సమావేశం

**మత్స్యకారుల సంక్షేమం, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చ**

**రాష్ట్రంలోని 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకం,**

**మత్స్యకారులకు కావాల్సిన వసతులపై చర్చించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**ఇన్సూరెన్స్, మోపెడ్, రిటైల్ అవుట్ లేట్ షాప్ ల ఏర్పాట్లపై ప్రభుత్వం**

**కార్యాచరణ చేస్తోంది-మంత్రి వాకిటి శ్రీహరి**

**ప్రతి 3 నెలలకు ఒక్కసారి మత్స్యకార అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం**

**ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుతో పాటు..పెండింగ్**

**బకాయిల విడుదలకు కృషి చేస్తా-మంత్రి వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఆగస్టు 4. :** విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలను ఆహారంగా చేర్చడంపై ఆలోచన చేస్తున్నాం-మంత్రి వాకిటి శ్రీహరి జిల్లా నుంచి గ్రామస్థాయిల్లో నెలకొన్న సభ్యత్వాలు వివాదాలను పరిష్కరిస్తాం-మంత్రి వాకిటి శ్రీహరి కోహెడలో ఇంటిగ్రెటెడ్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతుంది-మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిగ్రెటెడ్ మార్కెట్ నిర్మాణంతో ఆన్ లైన్ ద్వారా చేపల పంపిణీ చేయవచ్చు-మంత్రి వాకిటి శ్రీహరి కోటి 34 లక్షల రూపాయల ఇన్సూరెన్స్‌ను క్లియర్ చేశాం-మంత్రి వాకిటి శ్రీహరి మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులకు ప్రోటోకాల్‌పై ప్రభుత్వం మాట్లాడుతా-మంత్రి వాకిటి శ్రీహరి మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది-మంత్రి



వాకిటి శ్రీహరి రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, మత్స్య రంగ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం లక్ష్యంగా జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఱ క్రీడల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని మరింత విస్తరించడంతో పాటు మత్స్యకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ షాపుల ఏర్పాటు కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలను సమీక్షిస్తామని మంత్రి వెల్లడించారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించడంతో పాటు మత్స్యకారులకు సంబంధించిన పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల పోషకాహారాన్ని మెరుగుపరిచే దిశగా మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు నెలకొన్న సహకార సంఘాల సభ్యత్వ వివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ కోహెడలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా చేపల విక్రయాలు, పంపిణీకి అవకాశం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. మత్స్యకారులకు సంబంధించిన రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని తెలిపారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులకు ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# జలాశయాల్లోకి క్రమంగా పెరుగుతున్న వరద నీరు

**రైతుల్లో చిగురిస్తున్న ఆశలు.వంద టీఎంసీల చేరువలో శ్రీశైలం జలాశయం**

**సగం నిల్వలకు దగ్గరగా తుంగభద్ర.గోదావరికి భారీగా వచ్చిన వరదగోదావరి**

**నుంచి ఇప్పటికే సముద్రంలోకి చేరిన 306 టీఎంసీలు**



ఇన్నాళ్లు వెలవెల బోయిన జలాశయాల్లోకి క్రమంగా వరద ప్రవాహాలు చేరుతున్న వేళ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. 100 టీఎంసీల చేరువలో ఉంది. తుంగభద్ర జలాశయానికీ భారీ వరద ప్రవాహం వస్తోంది. గోదావరి నుంచి ఇప్పటికే 306 టీఎంసీల నీరు సముద్రంలోకి కలిసిపోయింది.తీవ్ర ఎల్‌నినో పరిస్థితులతో ఆందోళన చెందుతున్న రైతులకు కృష్ణా ఎగువ జలాశయాలు కాస్త ఆశలు కలిగిస్తున్నాయి. ఆలమట్టి జలాశయంలోకి ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 178.87 టీఎంసీల నీరు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 123.081 టీఎంసీలు, ప్రస్తుతం 119.9 టీఎంసీల మేర నిల్వ చేస్తూ మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ లోకి 92.22 టీఎంసీలు వచ్చాయి. పూర్తి నీటి నిల్వ 33.313 టీఎంసీలే. ఈ జలాశయంలోనూ 29.49 టీఎంసీలు నిల్వ చేసి మిగిలిన నీటిని దిగువకు వదులుతున్నారు.జలాశయాల్లోకి క్రమంగా పెరుగుతున్న వరద నీరు - రైతుల్లో చిగురిస్తున్న ఆశలు వంద టీఎంసీల చేరువలో శ్రీశైలం జలాశయం: తెలంగాణలోని జూరాల జలాశయం పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు. 7.44 టీఎంసీల మేర నిల్వ చేస్తూ, ఆపై ప్రవాహాన్ని శ్రీశైలానికి వదిలిపెడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 93.58 టీఎంసీల నీరు ఉంది. మంగళవారం 100 టీఎంసీలకు చేరుకోనుంది. పూర్తి స్థాయిలో నిండాలంటే 215.807 టీసీఎంసీలకు చేరుకోవాలి. ఎగువ నుంచి లక్షా 60 వేల 537 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. అలమట్టి, నారాయణపూర్, జూరాల జలాశయాలు నిండిపోయి నీరు దిగువకు వదులుతున్నారు.సగం నిల్వలకు దగ్గరగా తుంగభద్ర: తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 105.788 టీఎంసీలు. ప్రస్తుతం 44.19 టీఎంసీలకు చేరింది. నదీ పరివాహక ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శివమొగ్గ జిల్లా శృంగేరి వద్ద తుంగా నది గేట్లన్నీ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆ జలాలు నేరుగా తుంగభద్ర నదిని చేరుకోవడంతో జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. రోజూ కనీసం 6 టీఎంసీల వరకు నీటి నిల్వలు పెరుగుతున్నాయి.గోదావరికి భారీగా వచ్చిన వరద: సాధారణంగా ఖరీఫ్ లో గోదావరి డెల్టా వ్యవస్థకు నీటి సమస్యలు ఎదురైన సందర్భాలు అరుదు. ఈ ఏడాది సీలేరు నుంచి బైపాస్ చేసి నీళ్లు మళ్లించాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. జులై తొలి రోజుల్లో గోదావరిలో ప్రవాహం కరవైంది. అయితే జులై చివరిలో గోదావరికి ఎగువ నుంచి వరద ప్రవాహం మొదలైంది.ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అత్యధికంగా 14 లక్షల 61 వేల క్యూసెక్కుల వరద నీరు ధవళేశ్వరం కాటన్ బ్యారేజిని తాకింది. గోదావరిపై నీరు నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో వచ్చిన నీరు వచ్చినట్టు సముద్రంలోకి వదిలేస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటి వరకు 14.46 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 306 టీఎంసీల నీరు సముద్రంపాలయ్యింది.ఏలేరు జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.62 టీఎంసీలతో ఉంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరులోకి గోదావరి వరద జలాలలను మళ్లిస్తున్నారు.

# సింగరేణి సిగలోకి మరో గని

**'పీకేఓసీ-2'తో 25 ఏళ్ల పాటు నిరంతరాయ బొగ్గు ఉత్పత్తికి భరోసా .సింగరేణికి ఇటీవలే దక్కిన తాడిచర్ల-2 బొగ్గు గని.తాజాగా వేలంలో దక్కిన మణుగూరు డీప్ సైట్ బ్లాక్.చివర్లో జెన్‌కో వైదొలగడంతో టెండర్ ఏకగ్రీవం.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 బొగ్గు గని కేటాయింపుపై ఉత్కంఠ వీడింది. దీని కోసం సింగరేణి, జెన్‌కో సంస్థలు బిడ్‌లు వేయగా, బ్లాకు సింగరేణికే దక్కింది. సోమవారం జరిగిన వేలం ప్రక్రియలో జెన్‌కో టెండర్ ప్రక్రియ నుంచి వైదొలడంతో సింగరేణికే పీకేఓసీ-2 బ్లాక్ దక్కింది. కొత్త బ్లాకు సింగరేణికి దక్కడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.నామినేషన్ పద్ధతిలో తాడిచర్ల-2 కేటాయింపు : నల్ల బంగారాన్ని వెలికితీస్తూ సిరులు పండించే సింగరేణికి ఇటీవలే తాడిచర్ల-2 బొగ్గు గని దక్కింది. ఎలాంటి వేలం లేకుండా నామినేషన్ పద్ధతిలో ఈ బొగ్గు గనిని కేంద్రం సింగరేణికి కేటాయించింది. ఉత్పత్తి పడిపోతూ ఉద్యోగాలు తగ్గిపోతున్న పరిస్థితుల్లో తాడిచర్ల-2 గని కేటాయింపు సింగరేణికి కొత్త ఊపిరి పోసినట్లైంది. ఇక మణుగూరు డీప్ సైట్ బ్లాక్ సైతం వేలంలో సింగరేణికి దక్కింది.సోమవారం జరిగిన వేలం ప్రక్రియలో జెన్‌కో టెండర్ ప్రక్రియ నుంచి వైదొలగగా సింగరేణికి 'ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్- పీకేఓసీ' బ్లాక్ దక్కింది. కేంద్ర నిబంధనల ప్రకారం ఓవరాల్ గ్రేడ్-9 టన్ను ధరపై అధికంగా చెల్లించే వారికి బ్లాక్ దక్కుతుంది. టన్ను ధర రూ.2,850 ఉండగా దానిపై 6.5 శాతం అదనంగా చెల్లిస్తామంటూ కోట్ చేయడంతో ఈ బ్లాక్ సింగరేణిని వరించింది.పీకేఓసీ-2ను దక్కించుకున్న సింగరేణి.25 ఏళ్ల పాటు నడవనున్న గని : పి.కె.ఓ.సి-2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్‌లో 180 మిలియన్ టన్నుల వరకు బొగ్గు రిజర్వులు ఉన్నాయి. ఏడాదికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్ల పాటు ఈ గని నడుస్తుంది. దాదాపు 2 వేల మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇక్కడ దొరికే జీ-8 బొగ్గు కారణంగా మొత్తం రూ.43 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. అందులో రాష్ట్ర సర్కారుకు రూ.10 వేల కోట్ల ఆదాయం లభిస్తుంది. అంతిమంగా రాష్ట్ర ఇంధన భద్రతకు భరోసా, సింగరేణి అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరతాయి.పెరగనున్న కార్మికుల సంఖ్య సింగరేణి పరిధిలోని మరికొన్ని గనులను సంస్థకు కేటాయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే మణుగూరు ఓసీ గని విస్తరణ పనులు జరుగుతుండగా పి.కె.ఓ.సి దక్కడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మణుగూరు ఏరియాలో 2,528 మంది కార్మికులు పని చేస్తున్నారు. భవిష్యత్తులో వారి సంఖ్య కూడా పెరగ నుంది.తెలంగాణ బిడ్డగా కృషి చేశాను మణుగూరు సమీపంలోని పీ.కే.ఓ.సీ-2 డిప్-సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి దక్కించుకునేందుకు తాను కేవలం కేంద్ర మంత్రిగానే కాకుండా, తెలంగాణ బిడ్డగా కృషి చేశానంటూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పి.కె.ఓ.సి-2 బ్లాక్ సింగరేణికి లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన కార్మికులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలుపుతూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో పీ.కే.వై.సీ -2 డిప్-సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం ఒక చరిత్రాత్మక విజయం. సంస్థ మనుగడను కాపాడేందుకు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనాలని జారీ చేసిన ఆదేశాల ఫలితంగానే దాదాపు 12 ఏళ్ల తర్వాత వేలం ద్వారా కొత్త బొగ్గు బ్లాక్ లభించింది. సింగరేణి ప్రయోజనాలను కాపాడటంలో తగిన చొరవ చూపడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. దీనివల్ల కోయగూడెం-3, సత్తుపల్లి-3 వంటి కీలక బొగ్గు బ్లాకులు ప్రైవేట్ సంస్థల పాలయ్యాయి. ఇతర రాష్ట్రాలకు కూడా బొగ్గు గనుల సేకరణ, కీలక ఖనిజాల అన్వేషణను విస్తరించేందుకు సింగరేణి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. - భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

# తెలుగు రాష్ట్రాల మధ్య వారధి

**ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ప్రయాణించిన మంత్రి అంతా ఒకే**

**జాతీయ రహదారుల ఏర్పాటు ఎంతో సంతృప్తిని ఇస్తోందన్న మంత్రి తుమ్మల**

**నూతన రహదారులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి బాట పడుతుందని హర్షం**

**రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడి**



ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే తెలుగు రాష్ట్రాల మధ్య వారధిగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన రహదారిపై సోమవారం కొంత దూరం ప్రయాణించి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖమ్మం నగర పాలక సంస్థ శివారు ధంసలాపురం వద్ద రహదారి ఎగ్జిట్ సమీపంలో విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో జాతీయ రహదారుల ఏర్పాటు అనే అంశం ఎంతో సంతృప్తిని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. నూతన రహదారులతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రగతి బాటలు వేగంగా పడుతాయని అభిప్రాయపడ్డారు. ఖమ్మంకు సహజమైన రింగు రోడ్డు : జాతీయ రహదారులకు సహకరించిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలను తుమ్మల తెలిపారు. కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా పని చేసి కేంద్ర సర్వీసులో రిటైర్డ్ అయిన అధికారి గిరిధర్ సహకారంతోనే ఈ ప్రతిష్ఠాత్మక రహదారికి శ్రీకారం చుట్టామని గుర్తు చేసుకున్నారు. అమరావతి-నాగ్‌పూర్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే ఖమ్మం సిటీకి సహజ సిద్ధమైన రింగు రోడ్డు ఏర్పాటవుతుందని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పారిశ్రామిక, పర్యాటక రంగాల పురోగతికి కొత్తగూడెం వయా ఇల్లెందు నుంచి హైదరాబాద్ నేషనల్ హైవే ఎంతో ప్రముఖ పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్ రెడ్డి, తుపాకుల యలగొండ స్వామి, పైడి వెంకటేశ్వర రావు, బొమ్మిశెట్టి రమేశ్, ఆళ్ల అంజిరెడ్డి, ఆలపాటి ప్రసాద్ పాల్గొన్నారు.ఖమ్మర్ శీ దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే విశేషాలు .సూర్యాపేట నుంచి వచ్చే వాహనాలు ఖమ్మం జిల్లాలోకి రాగానే తెల్దారుపల్లి దగ్గర ఉన్న టోల్ గేట్ ద్వారా గ్రీన్ ఫీల్డ్ హైవేపైకి ప్రవేశిస్తాయి. చివరగా దేవరపల్లి సమీపంలో నిష్క్రమణ (ఎగ్జిట్) గేటు నుంచి దిగుతాయి.ఖమ్మం నుంచి దేవరపల్లి మధ్యలో ఉండే ప్రధాన పట్టణాల దగ్గర హైవే కింద మరో తొమ్మిది టోల్ ప్లాజాల నుంచి కూడా గ్రీన్ ఫీల్డ్ హైవేపైకి ఎంట్రీ, ఎగ్జిట్ కావచ్చు.ఈ గ్రీన్ ఫీల్డ్‌పై సాధారణ హైవేల మాదిరిగా టోల్ ట్యాక్స్ వసూలు చేయరు. వాహనం ప్రవేశం నుంచి నిష్క్రమణ వరకు ఉండే దూరాన్ని బట్టి మాత్రమే వసూలు చేస్తారు. ఉదాహరణకు ఓఆర్ఆర్ తరహాలో ఉంటుంది.హైవే పొడవునా ప్రతి కిలోమీటరుకు ఒక సీసీ కెమెరాను అమర్చారు. వందనం, చౌడవరం సమీపంలో భారీ గూడ్స్ వాహనాలు నిలిపేలా ట్రక్ లే బైలు కూడా ఏర్పాటు చేశారు.ఈ హైవేకు అమరావతి నుంచి నాగ్‌పూర్ వెళ్లే మరో గ్రీన్ ఫీల్డ్ హైవే వందనం-కొదుమూరు దగ్గర అనుసంధానమవుతుంది. ఇక్కడ కూడా రెండు హైవేల రవాణాకు అంతరాయం కలగకుండా క్లోవల్ లీఫ్ రోడ్డు నిర్మించారు. దీని ద్వారా పరస్పరం ఒక హైవే నుంచి మరో హైవేకు సులభంగా మారొచ్చు.ఈ హైవేపై వాహనాన్ని బట్టి 80, 100 కిలోమీటర్ల స్పీడుతో ప్రయాణించొచ్చు.తగ్గనున్న 56 కిలోమీటర్ల దూరం : ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారిని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, పంట పొలాల మీదుగా తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకునేలా రూపొందించారు. దీని కోసం 162.04 కిలోమీటర్ల మేర 4 వరుసల రోడ్డును నిర్మాణం చేశారు. ఇందులో ఖమ్మం జిల్లాలోనే 105 కిలోమీటర్లు కాగా, 3 ప్యాకేజీల్లో రూ.2,213.91 కోట్లతో భారీ ఖర్చుతో నిర్మాణం చేపట్టారు. దీనివల్ల హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు సుమారు 56 కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది. పనుల పరిశీలన పూర్తి కావడంతో అతి త్వరలోనే ఈ జాతీయ రహదారిని జాతికి అంకితం చేయనున్నారు.ఒకట్రెండు రోజుల్లో అందుబాటులోకి! : ఈ హైవేలో సంవత్సరం కిందటే అండర్ పాస్‌లు, రహదారులు పూర్తయ్యాయి. ఆర్వోబీల వల్ల దీని ప్రారంభానికి జాప్యం నెలకొంది. ఇటీవల ఎడమ వైపు ఉన్న ఆర్వోబీ నిర్మాణం పూర్తవడంతో వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఉందో లేదో తెలుసుకోవడానికి అధికారులు లోడ్ టెస్టింగ్ చేస్తున్నారు. ఇది పూర్తయితే మిగతా పెండింగ్ పనులు పూర్తి చేయాలని చూస్తున్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు తొలుత ఆగస్టు 1నే హైవేపై రాకపోకలు ప్రారంభించాలని భావించారు. కానీ అది సాధ్యం కాలేదు. తాజాగా మంత్రి తుమ్మల పనులను పరిశీలించిన నేపథ్యంలో మరో ఒకట్రెండు రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు.

# నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు దేశంలోనే కొత్త రికార్డ్

**మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి.ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్.90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ.నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర**



హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది.ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు.మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది.రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు

# మరో అంతర్జాతీయ స్థాయి సదస్సుకు ముస్తాబైన భాగ్యనగరం

**హైదరాబాద్ లో నేటి నుంచి బ్రిక్స్ సమావేశాలు.నేటి నుంచి బ్రిక్స్ దేశాల అవినీతి నిరోధక సమావేశాలు.భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్-2026కు అత్యంత ప్రాధాన్యత.సరిహద్దులు దాటిన అవినీతి నిర్మూలనపై బ్రిక్స్ దేశాల చర్చలు**




మరో అంతర్జాతీయ స్థాయి సదస్సుకు విశ్వనగరం హైదరాబాద్ ముస్తాబైంది. నేటి నుంచి బ్రిక్స్ దేశాల అవినీతి నిరోధక కార్యాచరణ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. బ్రిక్స్-2026కు భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సుకు అత్యంత ప్రాధాన్యత సంతరించు ుకుంది. అవినీతి నిర్మూలన, ఆర్థిక నేరస్థుల అప్పగింత, పారదర్శక పాలన వంటి కీలక అంశాలపై బ్రిక్స్ దేశాల ప్రతినిధులు చర్చలు చేయనున్నారు.సభ్యదేశాల ప్రతినిధులతో సదస్సు : భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్-2026 అవినీతి నిరోధక కార్యాచరణ బృందం నిర్వహించే రెండో సమావేశాలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. "ఆర్థిక స్థిరత్వం, సహకారం, ఆవిష్కరణ, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో నేటి నుంచి రెండు రోజుల పాటు ఇవి జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, ట్రైనింగ్ విభాగం సెక్రటరీ రచన షా ఈ సమావేశాలను ప్రారంభిం చనున్నారు. సదస్సుకు బ్రిక్స్ సభ్యదేశాల ప్రతినిధులతో పాటు, విధాన రూపకర్తలు, నిపుణులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారు. జూన్‌లో వర్చువల్‌గా జరిగిన మొదటి సమావేశం ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణను రూపొందించనున్నారు.హైదరాబాద్‌లో నేటి నుంచి బ్రిక్స్ సమావేశాలు.అవినీతి కేసుల పరారీలో నిందితుల అప్పగింత : ఈ సదస్సులో ముఖ్యంగా సరిహద్దులు దాటిన అవినీతిని అరికట్టడం, పాలనలో పారదర్శకతను పెంపొందించడంపై బ్రిక్స్ సభ్యదేశాలు విస్తృతంగా చర్చించనున్నాయి. అవినీతి కేసుల పరారీలో ఉన్న నేరస్థుల అప్పగింత, నేరస్థుల ఆచూకీ గుర్తించడంలో దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నాయి. అలాగే డిజిటల్ ఆస్తులు, ఫిన్‌టెక్ రంగాల్లో తలెత్తుతున్న అవినీతి ఘటనలను ఎదుర్కోవడంలో దేశాలు తమ అనుభవాలు, ఉత్తమ పద్ధతులను గురించి పంచుకోనున్నాయి. ముఖ్యంగా ఆవిష్కరణ, టెక్నాలజీ ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన అనే అంశంపై రేపు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే కిడ్నీలు డేంజర్ లో ఉన్నట్లే - నిర్లక్ష్యం చేయద్దు



శరీరంలోని ప్రధాన భాగం కిడ్నీలు. కిడ్నీలు రక్తాన్ని శుభ్రం చేస్తాయి. మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, పలు ఇతర కారణాల వల్ల కిడ్నీల పనితీరును ప్రభావితం చేస్తుంది. దీంతో అనేక కిడ్నీ సమస్యలు వస్తాయి. కిడ్నీలు డ్యామేజ్ అయితే కొందరిలో లక్షణాలు ఏమీ బయటకు కనిపించవు. కానీ చాలా వరకు వ్యక్తులలో లక్షణాలను ముందుగానే పసిగట్టవచ్చు. ఆ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే తగిన సమయంలో చికిత్స తీసుకుని కిడ్నీలను రక్షించుకోవచ్చు. దీంతో కిడ్నీలకు కలిగే ప్రమాదం తప్పుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీల పనితీరు పైన మనకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సంకేతాల అందుతాయి. వీటిని జాగ్రత్త గా గమనిస్తూ అవసరమైన చికిత్స తీసుకోవటం ద్వారా ముప్పు తప్పించుకోవచ్చు. కిడ్నీలు డ్యామేజ్ అయినప్పుడు లేదా డ్యామేజ్ అవుతున్న సమయంలో మూత్రంలో పలు మార్పులు కనిపిస్తాయి. ముఖ్యంగా తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. రాత్రి పూట ఈ అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. మీకు షుగర్ లేకపోయినా తరచూ మూత్రం వస్తుందంటే మీ కిడ్నీల సమస్య ఉందని అనుమానించాలి. మూత్రంలో నురుగు వస్తున్నా జాగ్రత్త పడాలి. మూత్రంలో ప్రోటీన్ ఉంటే ఇలా నురుగు కనిపిస్తుంది. వాస్తవానికి ఇది ప్రమాదకరం. అలాగే కొందరికి మూత్రంలో రక్తం పడుతుంది. దీన్నే హెమటురియా అంటారు. ఇది కూడా ఒక ప్రమాదకరమైన స్థితిగానే భావించాలి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. %ూశ్రీంశీ =ముఃు% తిరుపతి వెళ్లే భక్తులకు ఊహించని వరం - ఇక నుంచి..!! కిడ్నీల సమస్యలు ఉన్న వారి శరీరంలో ద్రవాలు ఎక్కువగా పేరుకుపోతాయి. దీంతో వారి పాదాలు, చేతులు, మడమలు, కాళ్ల భాగాలు వాపులకు గురవుతాయి. కొందరికి ముఖం కూడా ఉబ్బిపోయి కనిపిస్తుంది. కళ్ల కింద కూడా వాపులు కనిపిస్తాయి. కిడ్నీలు డ్యామేజ్ అయ్యాయని చెప్పేందుకు ఇవి ప్రధానమైన సంకేతాలుగా భావించాలి. కిడ్నీ సమస్య ఉన్నవారికి నీరసం, అలసట ఉంటాయి. చిన్న పనిచేసినా విపరీతంగా అలసిపోతారు. వాతావరణం వెచ్చగా ఉన్నప్ పటికీ చేతులు, పాదాలు మాత్రం చల్లగా ఉంటాయి. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కిడ్నీలు డ్యామేజ్ అయిన లేదా అవుతున్న వారిలో శరీరంలో టాక్సిన్లు అధిక మొత్తంలో ఉత్పత్తి అవుతాయి. చర్మం తరచూ దురదగా ఉంటుంది. పొడిబారి దురద పెడుతుంది. అలాగే ఆకలి లేకపోవడం, వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం ఇవన్నీ కిడ్నీ డ్యామేజ్‌కు సంకేతాలుగా అర్థం చేసుకోవాలి. ఈ లక్షణాలు అయినా కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవటం ద్వారా కిడ్నీలను కాపాడుకొనే అవకాశం కలుగుతుంది.

# నిద్రలో భయం, హఠాత్తుగా మెలకువ!



అర్ధరాత్రి.. అంతా గాఢనిద్రలో నిద్రిస్తున్నప్పుడు, కొంతమంది హఠాత్తుగా లేస్తారు. పక్కన ఎవరో ఉన్నట్లు అనిపించిందంటూ కంగారు పడుతుంటారు. నిద్రలో ఎవరో గొంతు నులిమినట్లుగా ఉందని భయపడతారు. ఈ పరిస్థితిని నైట్ టెర్రర్ లేదా స్లీప్ టెర్రర్ అంటారు. ఇది ఓ రకమైన 'స్లీప్ డిజార్డర్'గా నిపుణులు చెబుతున్నారు. అసలు నైట్ టెర్రర్‌కు కారణాలు ఏంటి? పిల్లల్లో ఈ సమస్య ఉంటే తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అన్నది ఇప్పుడు తెలుసుకుందాం!నైట్ టెర్రర్‌కు గురైన సమయంలో ఆ వ్యక్తి పూర్తిగా మేల్కొనరు. కానీ, భయంతో వణికిపోతారు. ఉదయం లేచాక ఆ విషయం గురించి స్పష్టంగా గుర్తుండదు. ఇది ఎక్కువగా చిన్న పిల్లల్లో కనిపిస్తుందంటున్నారు నిపుణులు. కొంతమంది పెద్దల్లోనూ తరచూ ఇలా జరుగుతూ ఉంటుందట. మానసిక ఒత్తిడి, ఆందోళన, అలసట, నిద్రలేమి దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. కొన్నిసార్లు జ్వరం లేదా ఏదైనా అనారోగ్య సమస్య ఉన్నప్పుడు కూడా ఈ నైట్ టెర్రర్ కనిపించే అవకాశం ఉంది. రాత్రి భయాలు నిద్రలేమి, ఒత్తిడి, జ్వరం, కొన్ని మందులు లేదా అంతర్లీన నిద్ర రుగ్మతలతో ముడిపడి ఉంటాయని ంశ్రీవవజూటశీబఅఝఅశీఅ అధ్యయనం పేర్కొంది.

**లక్షణాలు :**

చెమటలు పట్టడం.

అరుపులు లేదా ఏడుపులు.

వేగంగా శ్వాస తీసుకోవడం

వేగవంతమైన హృదయ స్పందన రేటు.

వేగవంతమైన, హింసాత్మక కదలికలు (కొట్టడం).

నిద్రలో నడవడం వంటి సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఅఅఅఎ పేర్కొంది.

చాలాసార్లు పేషెంట్స్‌కి నిద్రలో భయం అనిపించడం, ఎవరో పక్కన ఉన్నట్టు, తమని పట్టుకుంటున్నట్టు అనిపించడం జరుగుతుంటుంది. మోస్ట్ ఆఫ్ టైమ్స్ ఈ సమస్యను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నైట్ టైం బాగా నిద్రపోవడానికి కొన్ని మందులు ఇస్తాం. దీంతో ఈ ప్రాబ్లం సాల్వ్ అయిపోతుంది. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ లాంటివి ఉంటే దగ్గరలోని సైకియాట్రిస్టును సంప్రందిస్తే మంచిది - డా. బోయనపల్లి ఫిలిప్ కుమార్, సైకియాట్రిస్ట్

**పిల్లల్లో ఈ సమస్య ఉంటే :**

నైట్ టెర్రర్ సమయంలో పిల్లలు నిద్రలోనే ఉంటారు. కాబట్టి, వారిని మేల్కొలిపే ప్రయత్నం చేయొద్దంటున్నారు నిపుణులు. వారిని నెమ్మదిగా బుజ్జగిస్తూ మళ్లీ పడుకోబెట్టాలని చెబుతున్నారు.ఇలాంటి లక్షణాలు ఉన్న పిల్లలను ఒంటరిగా వదిలేయకుండా, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు పక్కన ఉండాలని సూచిస్తున్నారు.అలాగే, పిల్లలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలని చెబుతున్నారు. ఫోన్లు, టీవీలను ఎక్కువ సేపు చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.తగినంత నిద్ర ఉండాలని చెబుతున్నారు. అది కూడా రోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవడం అలవాటు చేయాలంటున్నారు.వయసు పెరిగే కొద్దీ ఎలాంటి చికిత్స లేకుండానే పిల్లల్లో స్లీప్ టెర్రర్ మాయమవుతుందని తెలియజేస్తున్నారు.ఒకవేళ స్లీప్ టెర్రర్ సమస్య తీవ్రంగా ఉంటే వైద్య నిపుణులను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు.నిద్ర భయాలు భద్రతా ప్రమాదానికి కారణమైతే, నిద్రకు అంతరాయం కలిగిస్తే, కాలక్రమేణా తగ్గకపోతే లేదా తరచుగా సంభవిస్తే చికిత్స అవసరం కావచ్చుని ఝఎశీఎశ్రీఅఅఅఎ అధ్యయనం పేర్కొంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి :** నైట్ టెర్రర్ సాధారణంగా కొంత సమయం మాత్రమే ఉంటుంది. ఈ సమస్య ఉన్నవారు వీలైనంత వరకు ప్రతిరోజు ఒకే సమయానికి నిద్రపోవడం మంచిదంటున్నారు నిపుణులు. 7 నుంచి 8 గంటల పాటు రాత్రి నిద్రపోయాలని చెబుతున్నారు. ఈ క్రమంలో రాత్రివేళ మొబైల్, టీవీ చూడడం తగ్గించాలని సూచిస్తున్నారు. యోగా, మెడిటేషన్ లాంటివి చేస్తే మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని పేర్కొంటున్నారు. శారీరక వ్యాయామం కూడా మేలంటున్నారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే నైట్ టెర్రర్స్ తగ్గే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు. ఇది ప్రమాదకరమైన సమస్య కాకపోయినా.. నిర్లక్ష్యం చేయవద్దంటున్నారు. ఒకవేళ తరచూ నిద్రలో భయం, ఆందోళన కలుగుతూ ఉంటే సంబంధిత నిపుణులు సంప్రదించాలని సలహా ఇస్తున్నారు. మీ సమస్యను వివరించి తగిన సూచనలు పాటించాలని తెలియజేస్తున్నారు.

# కాఫీ తాగితే లివర్ క్యాన్సర్ దూరం!

## నిపుణులు ఏమంటున్నారో తెలుసా

## కాఫీతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు!

## మితంగా తీసుకోవాలని సూచన



ఉదయం లేవగానే కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. ఇది నూతన ఉత్సాహాన్ని, ఏకాగ్రతను పెంచుతుంది. ఇంతే కాకుండా, శరీరంలోని అత్యంత ముఖ్యమైన అవయవాలలో ఒకటైన కాలేయానికి రక్షణ అందిస్తుందని పరిశోధనలు చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!రోజువారీ కాఫీ వినియోగాన్ని రెండు కప్పులకు పెంచడం వల్ల, అత్యంత సాధారణ కాలేయ క్యాన్సర్ రకమైన 'హెపటోసెల్యులర్ కార్సినోమా' వచ్చే ప్రమాదం సుమారు 35 శాతం తగ్గుతుందని చీఝఅశీఖశ్రీ ాఅఎతీఖతీఎ శీట వీవఎఅఎఅఅవ అధ్యయనం పేర్కొంది. మద్యపానం, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×) వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ ఫలితాలు సానుకూలంగానే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.దకాఫీ కాలేయ క్యాన్సర్ ప్రమాదాన్ని ఎలా తగ్గిస్తుంది? : కాఫీ అనేది కేవలం కెఫీన్ ఉన్న పానీయం మాత్రమే కాదు. ఇందులో పాలీఫెనాల్స్, డైటెర్పెనెస్, సహజ యాంటీ ఆక్సిడెంట్లతో సహా వెయ్యికి పైగా జీవక్రియలకు ఉపయోగపడే సమ్మేళనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఈ సమ్మేళనాలు వాపును తగ్గించగలవని, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను నిరోధించగలవని చెబుతున్నారు. అంతేకాదు, లివర్ ఫైబ్రోసిస్ అభివృద్ధిని నెమ్మదింపజేయగలవని, లివర్ ఎంజైమ్ స్థాయిలను మెరుగుపరుస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఫలితంగా, కాలేయ వ్యాధులు తీవ్రమైతే వచ్చే 'సిర్రోసిస్', కాలేయ క్యాన్సర్ ప్రమాదాన్ని కాఫీ తగ్గిస్తుందట.

**పరిశోధనలు ఏమి చెబుతున్నాయి?**

1966 నుంచి 2007 మధ్య జరిగిన అధ్యయనాలపై ఆధారపడిన ఒక మెటా-విశ్లేషణ ప్రకారం, రోజుకు రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 43% తగ్గుతుందని చీఝఅశీఖశ్రీ ాఅఎతీఖతీఎ శీట వీవఎఅఎఅఅవ అధ్యయనం పేర్కొంది.రోజుకు రెండు కప్పుల కెఫీన్ ఉన్న కాఫీ తాగడం వల్ల ఎజజ ప్రమాదం 27% తగ్గగా, అదే పరిమాణంలో కెఫీన్ లేని కాఫీ తాగడం వల్ల ప్రమాదం 14% తగ్గిందని దీవీజీ జీశీబతీఖశ్రీ ప్రచురించింది.ఎంత కాఫీ తాగాలి? : ఎంత తాగాలి అనేదానిపై అంతర్జాతీయంగా ఒకే విధమైన సిఫార్సు లేనప్పటికీ, మితంగా తీసుకోవడం వల్ల స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. రోజుకు రెండు నుంచి నాలుగు కప్పులు తాగితే ఆరోగ్యానికి మంచిదంటున్నారు. ఈ క్రమంలో ఫిల్టర్ కాఫీ అయినా, ఇన్‌స్టంట్ కాఫీ అయినా ఫలితం ఒకేలా ఉంటుందని అంటున్నారు. అయితే, అతిగా తీసుకోవడం వల్ల జీర్ణక్రియలో అసౌకర్యం, నిద్రలేమి లేదా గుండె వేగం పెరగడం వంటి దుష్ప్రభావాలు కలగవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇవి వ్యక్తిగత సున్నితత్వంపై ఆధారపడి ఉంటాయని తెలియజేస్తున్నారు. మొత్తంగా చెప్పాలంటే, మితంగా కాఫీ తాగడం అనేది కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక సులభమైన మార్గంగా పరిశోధనలు సూచిస్తున్నాయి.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరట :**

**మద్యపానం, ధూమపానం :** లివర్ ఆరోగ్యం కోసం కాఫీ తాగుతున్నాం కదా అని మద్యపానం, ధూమపానం వంటివి కొనసాగిస్తే ఎలాంటి ప్రయోజనమూ ఉండదంటున్నారు నిపుణులు. కాఫీ వీటికి ప్రత్యామ్నాయం కాదని చెబుతున్నారు.

**వైద్య సలహా :** గుండె సమస్యలు, తీవ్రమైన ఆందోళన, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు లేదా గర్భిణులు కాఫీ విషయంలో డాక్టర్ల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**జీవనశైలి :** ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, సరైన బరువు మెయింటెయిన్ చేస్తూ, రెగ్యులర్‌గా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. ఇవన్నీ చేస్తూ కాఫీ తాగితే ఒక అదనపు రక్షణగా ఉంటుందని, అలానే భావించాలని సలహా ఇస్తున్నారు.

# మనో వికాసానికి




బాల సాహిత్యమే పునాదిమానవ జీవితానికి బాల్యం ఆధారభూతమైన దశ. ఈదశలో పిల్లల మనస్సు ఆకర్షణకు లోనవుతుంది, ఊహలకుగొప్ప స్థావరంగా ఉంటుంది. అలాంటి దశలో వారు చదివే, వినే, చూసే, అనుభవించే అంశాలే భవిష్యత్తు కాలంలో వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రేమ, ఆహారం, స్వచ్ఛమైన గాలి, ఆటలు ఎంత అవసరమో కళలు, కథలు, కవితలు, సంగీతం కూడా అంతే అవసరం. బాలసాహిత్యం అనేది పిల్లల కోసం రాసేది. అలా రాసిన బాల సాహిత్యం పిల్లల్లో తమదైన ఊహాశక్తి, జ్ఞానం, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కథలు, కవితలు, నాటికలు, జానపద గాథలు, ఇతర రూపాల్లో లభించే బాల సాహిత్యం పిల్లల మానసిక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. నిజానికి బాల సాహిత్యం ఎదుగుతున్న పిల్లల జీవితాల్లో ఒక అమూల్యమైన సంపద. ఇది వారి మనసును ఆకర్షిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, నైతిక విలువలను నేర్పిస్తుంది. భవిష్యత్ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి బాల సాహిత్యం ఎంతో ముఖ్యమైనది. పిల్లలను ఉత్తమ తరంగా, పౌర సమాజంగా సంసిద్ధం చేయడానికి బాల సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మనం పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చు. బాల సాహిత్యం చదువడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి రెక్కలు కట్టుకొని ఎగురుతుంది. మాయాజాల కథలు, సాహస గాథలు వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇవి వారి సృజనాత్మక ఆలోచనలను పెంచి, సమస్యలను వినూత్నంగా పరిష్కరించే సామర్థ్యాన్ని అందిస్తాయి.

బాల సాహిత్యం వివిధ రూపాల్లో ఉంటుంది. వాటిద్వారా వారిలో భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. సరళమైన, ఆకర్షణీయమైన శైలిలో రాసిన కథలు, కవితలు వారి పఠన, రచన, శ్రవణ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయి. బాలసాహిత్యం పిల్లలకు సత్యం, ధర్మం, సహానుభూతి, సహకారం వంటి నైతిక విలువలను కూడా నేర్పుతుందనే చెప్పవచ్చు. అలనాటి పంచతంత్రం, ఈసప్ కథలు వంటివి నీతి బోధనల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. వేమన, సుమతి పద్యాలు వాళ్లలో సృజనాత్మకతకు పాదులు వేస్తాయి. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, జానపద కథలు పాటల ద్వారా పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకుంటారు. ఇది వారిలో సాంస్కృతిక గౌరవాన్ని, గుర్తింపును కలిగిస్తుంది. బాలలు కథలు, కవితలు, పాటలు చదువడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ఓర్పు, పట్టుదల వంటి గుణాలు పెరుగుతాయి. బాల సాహిత్యం పిల్లల్లో సానుకూల వ్యక్తిత్వ లక్షణాలను రూపొందిస్తుంది. సమూహ కథలు, స్నేహగాథలు పిల్లలకు సహకారం, జట్టు కృషి, టీం స్పిరిట్ పక్కవారి భావాలను గౌరవించడం లాంటి అంశాలను నేర్పుతాయి. అంతేకాదు, సైన్స్ విజ్ఞాన సంబంధిత కథలు, కవితలు శాస్త్రీయ పిల్లల్లో జ్ఞానాభిరుచిని పెంచుతాయి. కథల ద్వారా పిల్లలు వివిధ భావోద్వేగాలను అర్థం చేసుకుంటారు. దుఃఖం, సంతోషం, భయం వంటి భావాలను నియంత్రించడం నేర్చుకుంటారు. బాల సాహిత్యం పిల్లలకు వినోదాన్ని అందిస్తూనే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

ఇట్లా బాలల గురించి బాలల సాహిత్యం సినిమాలు సాంస్కృతిక రంగం గురించి చాలా మాట్లాడతాం. కానీ, మన దేశంలో పిల్లల కోసం చేస్తున్నదేమిటి? ఎంత? అని ఆలోచిస్తే జరుగుతున్నది చాలా స్వల్పమనే చెప్పాలి. ముఖ్యంగా పిల్లల సృజనాత్మక రంగంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ. మలయాళం, బెంగాలీ, కన్నడ, కొంత మరాఠీ భాషల్లో మాత్రం ఎన్నదగిన కృషి జరుగుతున్నది. తెలుగులో బాల సాహిత్యం విరివిగానే వస్తున్నప్పటికీ ఇంకా నాణ్యమైన రచనలు రావాల్సి ఉన్నది. మరోవైపు బాల సాహిత్యకారులను ద్వితీయస్థాయి సృజనకారులుగా కాకుండా వారికి ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నది. సాహిత్య విషయాలు ఇట్లా ఉంటే సిన్మా సంగతి మరింత దారుణం. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన వందల బాలల సినిమాలు ముంబై చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ గోదాముల్లో స్తబ్ధంగా పడి ఉన్నాయి. ఇక మన హైదరాబాద్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పిల్లల సినిమాల పండుగకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తిలోదకాలిచ్చేశాయి.ఈ స్థితిలో బాల సాహిత్యకారులు మరో అంశాన్ని గమనించాల్సి ఉన్నది. ఇవ్వాళ ప్రాథమికోన్నత విద్యాసంస్థలన్నీ ఇంగ్లీష్ మాధ్యమానికే మొగ్గు చూపుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగాల కోసమైనా, మరి దేనికోసమైనా ఇంగ్లీష్ తప్పనిసరి అనే వాదంతో తెలుగు బోధన అపురూపమైపోయిందనే చెప్పాలి. ఇక ఐటీ తదితర రంగాల్లో ఉన్నవాళ్లకు తెలుగు చదువడమే గగనమైపోయింది. అందుకే బాలసాహిత్య సృజనకర్తలు కేవలం తెలుగులోనే రాసి ఊరుకోకుండా వాటికి ఆంగ్లానువాదాలను కూడా జతచేసి ప్రచురించగలిగితే ఈ రోజుల్లోని ఇంగ్లీష్ మీడియం స్కూళ్లల్లో వాటికి సముచితమైన స్థానం లభిస్తుంది.

టీవీల్లో, ఇంటర్నెట్‌లో ఇంగ్లిషుకే అలవాటు పడిపోతున్న బాలలకు ద్విభాషా పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ దిశలో పెద్దపల్లి లాంటి ఒక మారుమూల ప్రాంతంలో జరిగిన ఒక ప్రయత్నాన్ని అందరి దృష్టికి తేవాలని ఉన్నది. పుల్లూరి జగదీశ్వర్‌రావు అనే బాల సాహిత్యవేత్త 'లిటిల్స్' అనే ఒక కథల పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రాసి ప్రచురించారు ఆయన ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. విద్యాధికుడైన ఆయన పలు పత్రికల్లో కూడా వ్యాసాలు రాస్తారు. 'ఎడారి మొక్కలు' కథతో మొదలయ్యే ఈ కథా సంకలనంలో 24 కథలున్నాయి. అలతి అలతి మాటల్లో జీవకారుణ్యం, పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం వంటి అనేక అంశాలను కథలుగా ద్విభాషల్లో గుదిగుచ్చారు. ఈ కథలను చదివి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆకర్షితుడై 150 పేజీల 'లిటిల్స్' పుస్తకాన్ని తానే ముద్రించి పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేయించారు. కలెక్టర్ శ్రీహర్ష రాసిన ముందుమాటలో 'పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలం బాలబాలికలకు అత్యంత ముఖ్యమైన కాలం. వాళ్లు వ్యక్తులుగా రూపొందే క్రమం అక్కడే మొదలవుతుంది' అన్నారు. అది ముమ్మాటికీ నిజం. పుల్లూరి జగదీశ్వర్‌రావు వలె పిల్లల కోసం ద్విభాషా కథలు, కవితలు రాయడం, కలెక్టర్ శ్రీహర్ష లాగా ప్రోత్సహించి స్కూలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రమంతటా, అన్ని జిల్లాల్లోనూ జరగాల్సి ఉన్నది. అట్లయితేనే అర్థవంతమైన బాల సాహిత్యం అందుబాటులోకి వస్తుంది.

# అకస్మాత్తుగా కుంటుతున్నాడు..



మా బాబు వయసు మూడు సంవత్సరాలు. హుషారుగానే ఆడుకుంటాడు. ఇంతకుముందు ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవు. అందరిలానే పరుగెత్తుతాడు, మాట్లాడతాడు. కానీ, వారం రోజులుగా తన నడకలో మార్పు కనిపిస్తున్నది. ఎందుకో కుంటుతున్నాడు. డాక్టర్‌కి చూపిస్తే.. నొప్పి ఉందని, కొన్ని నొప్పి తగ్గించే మందులు ఇచ్చారు. అవి వాడినా తగ్గలేదు. ఇప్పుడు ఏ వైద్యుడిని సంప్రదించాలి? మూడు సంవత్సరాల వయసు పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. బాగా గెంతుతూ ఉంటారు. కుంటిగా నడవడం, నడకలో తేడా వచ్చిందంటే లోపల ఏదో సమస్య ఉండే ఉంటుంది. మీరు ఇప్పటికే వైద్యులకు చూపించామని చెబుతున్నారు. కానీ, ఏ డాక్టర్ అన్నది వివరించలేదు. పిల్లల వైద్యులతో తప్పని సరిగా చికిత్స చేయించాలి. ఎటువంటి గాయం లేకుండా, దెబ్బ కనిపించకుండా ఉన్నా.. పెద్దలు చూడనప్పుడు కిందపడి గాయపడవచ్చు. అవి కనిపించకపోవచ్చు. అందువల్ల నొప్పి, నడకలో మార్పు వస్తుంది. అలాంటి నొప్పి రెండు, మూడు రోజుల్లో సాధారణంగా తగ్గిపోవాలి. కొన్నిసార్లు జాయింట్స్ (కీళ్ల)లో, ఎముకలో, కండరాల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నా నొప్పి కలగడం, నడకలో మార్పు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ ఇన్‌ఫెక్షన్ ఉంటే జ్వరం వస్తుంది. బిడ్డ హుషారుగా ఉండకపోవడం, రోజూ ఆడినట్టుగా ఆడకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు వారం, రెండు వారాలపాటు ఇన్‌ఫెక్షన్ ఉంటే కీళ్లలో నీరు చేరుతుంది. తుంటి ఎముక కీళ్లలో ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఈ ఇబ్బంది దానికదే తగ్గిపోతుంది. కొద్దిగా నొప్పి, కుంటుతూ నడవడం కనిపిస్తాయి. ఏది ఏమైనా, పిల్లల డాక్టర్, కుదిరితే పిల్లల ఎముకల డాక్టర్‌కి చూపిస్తే మంచిది. అవసరమైన ఎక్స్‌రే, స్కాన్, రక్తపరీక్షలు చేయించాలి. ఆ తర్వాత వైద్యుల సలహాలు పాటించాలి.

# ఐటీ కంపెనీల దుకాణం బంద్ అవ్వక తప్పదా




కొంపలు ముంచుతున్న ఏఐ.ఫస్ట్ దెబ్బ కృత్రిమ మేధస్సు ఆటోమేషన్ టెక్నాలజీల వేగవంతమైన పురోగతి భారతీయ ఐటీ సేవల రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. గ్లోబల్ టెక్ దిగ్గజాలు తమ సాంప్రదాయ అవుట్‌సోర్సింగ్ నమూనాలను పునరాలోచించుకుంటూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇందులో భాగంగా ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ హెచ్‌సీఎల్‌టెక్ తో ఉన్న తమ దీర్ఘకాలిక ఇంజనీరింగ్ కాంట్రాక్టులో కీలక కోత విధించింది. అలాగే మెటా సైతం విప్రో తన కాంట్రాక్టు పరిధిని తగ్గించుకోవడం ఐటీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత పదేళ్లుగా గూగుల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఇంజనీరింగ్ సేవలను హెచ్‌సీఎల్‌టెక్ నిర్వహిస్తోంది. ది ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. గతంలో సంవత్సరానికి 200 మిలియన్ డాలర్లుగా (సుమారు రూ.1,660 కోట్లు) ఉన్న ఈ ప్రాజెక్టు విలువను గూగుల్ ఇప్పుడు తగ్గించింది. దీనివల్ల హెచ్‌సీఎల్‌టెక్ వార్షిక ఆదాయంలో సుమారు $50 మిలియన్ల (రూ. 415 కోట్లు) కోత పడనుంది. అయితే 14.7 బిలియన్ డాలర్ల భారీ ఆదాయం ఉన్న హెచ్‌సీఎల్‌టెక్‌కు ఇది పరిమిత ప్రభావమే అని భావించినప్పటికీ, ఒక గ్లోబల్ దిగ్గజం అవుట్‌సోర్సింగ్‌ను ఆటోమేట్ చేయడం ఐటీ పరిశ్రమలో మారుతున్న భవిష్యత్ ధోరణికి అద్దం పడుతోంది. ఈ ప్రాజెక్టుపై పనిచేస్తున్న దాదాపు 1,000 మంది ఉద్యోగులను తొలగించకుండా ఏఐ, క్లౌడ్ సేవలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి అధిక డిమాండ్ ఉన్న విభాగాలకు బదిలీ చేసేందుకు కంపెనీ చర్యలు చేపడుతోంది. ఇదే విధమైన ఒత్తిడిని మరో ఐటీ దిగ్గజం విప్రో కూడా ఎదుర్కొంటోంది. సోషల్ మీడియా దిగ్గజం మెటా, తన డిజిటల్ మార్కెటింగ్ కార్యకలాపాల ప్రాసెస్ మార్చడంతో విప్రోకి ఉన్న కాంట్రాక్ట్ వ్యాపారంలో 25 శాతం కోత పడింది. దీనితో మెటా నుంచి విప్రోకు వచ్చే వార్షిక ఆదాయం $100 మిలియన్ల నుండి $75 మిలియన్లకు క్షీణించినట్లు మింట్ నివేదించింది.యూటర్న్ తీసుకున్న డేటా సెంటర్లపై రూ. 3,500 కోట్ల పెట్టుబడి.. భారీ ఇన్వెస్ట్ వెనుక వ్యూహం ఇదే.. ఇంతకాలం వేలాది మంది ఇంజనీర్లపై ఆధారపడి నడిచిన సాంప్రదాయ ఐటీ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టుల స్థానంలో, తక్కువ వనరులతో ఆటోమేషన్ ద్వారా వేగవంతమైన ఫలితాలను ఇచ్చే భాగస్వాముల కోసం గ్లోబల్ కంపెనీలు వెతుకుతున్నాయి. నాన్-కోర్, సాధారణ సేవలను ఏఐ సాధనాల ద్వారా కంపెనీలు సొంతంగానే పూర్తి చేసుకుంటుండటంతో భారతీయ ఐటీ కంపెనీలు కూడా కేవలం మ్యాన్ పవర్ అందించడమే కాకుండా ఏఐ నైపుణ్యాలను పెంపొందించుకోవడం అనివార్యంగా మారింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.ఐటీ

# రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద బంగారం ఎంత ఉందో తెలుసా




బంగారం ధరలు గత కొంత కాలంగా పెరుగుతోంది. ఏడాదిన్నర క్రితం నుంచి ఇప్పటి వరకు పసిడి ధర భారీగా పెరిగింది. దీనికి ప్రధాన కారణం. అంతర్జాతీయ పరిస్థితులు, పలు సెంట్రల్ బ్యాంకులు బంగారం కొనుగోలు చేయడమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా దేశాల సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేస్తుంటాయి. ప్రపంచంలోని వివిధ దేశాల వద్ద భారీగా పసిడి నిల్వలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో చైనా భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన 10 కేంద్ర బ్యాంకుల్లో భారీగా పసిడి నిల్వలు ఉన్నాయి. యూఎస్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్, జపాన్, భారత్, టర్కీ దేశాల సెంట్రల్ బ్యాంకుల వద్ద రూ.26,500 టన్నుల బంగారం ఉంది. ందులో భారత్ వద్ద 880.52 మెట్రిక్ టన్నుల బంగారం ఉంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గత మంగళవారం పార్లమెంట్ లో ఒక ప్రకటన చేసింది. ఈ ప్రకటన సందర్భంగా భారతీయుల వద్ద ఎంత బంగారం ఉందని ప్రశ్నించగా.. దేశంలోని మతపరమైన ప్రదేశాలు, కుటుంబాల వద్ద ఎంత బంగారం ఉందనే సమాచారం తమ వద్ద లేదని ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారం పేర్కొన్నారు. 2026 జూన్ 26 నాటి డేటా ప్రకారం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద 880.52 మెట్రిక్ టన్నుల బంగారం ఉందని ప్రకటించారు. స్థిరంగా బంగారం ధరలు. ఇప్పుడే కొనేయండి. 2025 మార్చి 31 నాటికి ఆర్‌బిఐ వద్ద 879.58 మెట్రిక్ టన్నుల బంగారం ఉందని పంకజ్ చౌదరి వివరించారు. అంతకు ముందు 2024 మార్చి 31 నాటికి, ఆర్‌బిఐ వద్ద 822.10 మెట్రిక్ టన్నుల బంగారం ఉండేదని గుర్తు చేశారు. అయితే భారతీయుల వద్ద భారీగా ఉన్నట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. భారతీయ ఇళ్లలో 34, 600 టన్నుల బంగారం ఉందని అధ్యయనాలు పేర్కొన్నాయి. భారతీయ ఇళ్లలో ఉన్న బంగారం నిల్వల విలువ దాదాపు 5 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువే. అంటే ఇది భారత జీడీపీ కంటే ఎక్కువ. భారత జీడీపీ దాదాపు 4.1 ట్రిలియన్ డాలర్లు. ఇక మన వద్ద బంగారంలో సుమారు 67 శాతం ఆభరణాల రూపంలోనే ఉంది. చాలా దేశాల్లో పసిడిని పెట్టుబడిగా చూస్తారు. కానీ.. ఇండియాలో బంగారాన్ని స్టేటస్ గా చూస్తారు. సంప్రదాయ ఆచారాల్లో భాగంగా చూస్తారు. బాబు లేదా పాప పుడితే బారసాలకు బంగారం పెడతారు. పుట్టిన రోజు చేస్తే బంగారం పెడతారు. ఆడ బిడ్డకు ఫంక్షన్ చేస్తే బంగారం పెడతారు. ఇక పెళ్లి చేస్తే మామూలుగా ఉండదు. అందుకే భారతీయల్లో బంగారం భాగమైందని చెబుతారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# జీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ కు షాకిచ్చిన సెబీ

## స్టాక్ మార్కెట్ నుంచి నిషేధం

ప్రమోటర్లకు అనుబంధంగా ఉన్న సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు కంపెనీ ఆస్తులను మళ్లించినందుకు, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కొరఢా ఝులిపించింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ తో పాటు దాని ప్రమోటర్లైన సుభాద్ చంద్ర, పునీత్ గోయెంకాలకు రూ.1.5 కోట్ల జరిమానా విధించడంతో పాటు, వారిని ఒక సంవత్సరం పాటు స్టాక్ మార్కెట్ నుంచి నిషేధించింది. హైదరాబాద్‌లోని కంపెనీ భూముల పత్రాలను అనధికారికంగా తాకట్టు పెట్టినందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రమోటర్ల యాజమాన్యంలోని సంస్థ అయిన ఎస్సెల్ గ్రూప్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి రూ.726 కోట్లు రుణం తీసుకోవడానికిజీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆస్తిని తాకట్టు పెట్టింది. బోర్డు, ఆడిట్ కమిటీ ఆమోదం లేకుండా భూములు తాకట్టు పెట్టింది. అంతే కాకుండా ఆ విషయాన్ని బహిర్గతం చేయలేదని ఆడిట్ లో తేలింది. "ఈ లావాదేవీ గురించి తెలిసి ఉన్నప్పటికీ, గోయెంకా దానిని బోర్డుకు, ఆడిట్ కమిటీకి, చట్టబద్ధమైన ఆడిటర్లకు వెల్లడించడంలో విఫలమయ్యారని సెబీ పేర్కొంది. ఈ లావాదేవీకి సంబంధించిన ఎలాంటి వివరాలను ఈ సంవత్సరాల ఆర్థిక నివేదికలలో వెల్లడించలేదని తెలిపింది.




జునిపర్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓ. గ్రే మార్కెట్ ఎలా ఉందంటే. జీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ సంవత్సరాల తరబడి పెట్టుబడిదారులకు, స్టాక్ ఎక్స్ఛేంజీలకు లేదా ఆర్థిక నివేదికలలో ముఖ్యమైన పరిణామాలను వెల్లడించడంలో విఫలమైంది. అంతేకాకుండా, జీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ వాటాదారులకు తప్పుడు, అసత్య, తప్పుదారి పట్టించే సమాచారాన్ని అందిస్తూ శ్రీ గోయెంకా సీఈఓ-సీఎఫ్ఓ సర్టిఫికేట్‌పై సంతకం చేశారని సెబీ కనుగొంది. ఈ నోటీసులు అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, వెల్లడింపు నిబంధనలను ఉల్లంఘించాయని నిర్ధారించిన తర్వాత, సెబీ జీల్ ను రెండు నెలల పాటు స్టాక్ మార్కెట్ల నుంచి నిషేధించింది. గోయెంకా, చంద్రలకు చెరో 12 నెలల పాటు స్టాక్ మార్కెట్ నుంచి నిషేధించింది. అంతేకాకుండా, సెబీ జీల్‌కు రూ.30 లక్షలు, గోయెంకాకు రూ.58 లక్షలు, చంద్రకు రూ.60 లక్షల జరిమానా విధించింది. ఉత్తర్వు అందిన తేదీ నుంచి మూడు నెలలలోపు లేదా గడువు ముగిసేలోపు, ఏది ముందు అయితే దానిలోపు, తెరిచి ఉన్న ఏవైనా డెరివేటివ్ పొజిషన్‌లను మూసివేయాలని కూడా నోటీసులను ఆదేశించింది. తుది ఉత్తర్వు అందిన తేదీ నుంచి 45 రోజులలోపు జరిమానాను చెల్లించాలని కూడా సెబీ ఆదేశించింది. డిస్క్లైమర్ ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# కెరీర్ లో బ్రేక్‌తీసుకోవాలనుకుంటున్నారా

**ఇలా చేస్తే ఆర్థిక ఇబ్బందులు రావు.ఉద్యోగం మధ్యలోనే విరామం తీసుకోవాలని భావిస్తున్నారా**

**నిర్ణయం తీసుకునేముందు ఈ విషయాలను పరిగణించాలంటున్న నిపుణులు**

ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో కెరీర్‌కు బ్రేక్ ఇవ్వాల్సిందే. అందుకే రిటర్మెంట్‌అనే పద్ధతిని తీసుకొచ్చారు. అయితే, కొందరు పదవీ విరమణ వరకు వేచి ఉండకుండా రీఫ్రెష్‌అవ్వడానికి కెరీర్‌మధ్యలోనే విరామం తీసుకుంటారు. మరికొందరు తమ నైపుణ్యాలను పెంచుకుని మరింత సమర్థులుగా మారడానికి ఉపయోగపడే కోర్సులను నేర్చుకోవడానికి కూడా విరామాలు తీసుకుంటున్నారు. అయితే, కారణం ఏదైనా కెరీర్ విషయంలో బ్రేక్ తీసుకోవడం అంత ఈజీ కాదు. అయినా తీసుకోవాలని నిర్ణయించుకుంటే ఆర్థిక విషయాలను సరిగ్గా ప్లాన్‌చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.పరిశోధన: స్కిల్స్‌డెవలప్‌చేసుకోవడానికి లేదా మరొక కెరీర్‌కు మారడానికి బ్రేక్‌తీసుకోవాలని నిర్ణయం తీసుకుంటున్నట్లయితే, అందుకు తగినట్లుగా పరిశోధన చేయాలంటున్నారు. పరిశోధన అంటే బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించడం మాత్రమే కాకుండా, కొన్ని సంవత్సరాల తర్వాత కూడా 'కెరీర్ బ్రేక్ ఎంపిక సరైందేనా' అని మరింత లోతుగా పరిశీలించి అర్థం చేసుకోవాలని చెబుతున్నారు. ఈ విరామ సమయంలో ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడంతోపాటు, ఎటువంటి ఆర్థిక ఆందోళనలూ లేకుండా ప్రస్తుత జీవనశైలిని కొనసాగించగలరో, ఆర్థిక లక్ష్యాలను సాధించగలరో నిర్ధారించుకోవాలని వివరిస్తున్నారు. దీనికి సంబంధించిన లెక్కలను సరిచూసుకోవడానికి ఎక్సెల్ షీట్‌ను ఉపయోగించమంటున్నారు. ఆర్థిక ఒత్తిడి ప్రభావితం చేయకుండా చూసుకోవడానికి, పార్ట్-టైం లేదా కన్సల్టెంట్‌గా పనిచేస్తూనే ప్రణాళికను అమలు చేసే ఇతర మార్గాలను కూడా పరిశీలించాలని సూచిస్తున్నారు.ఒకవేళ యాజమాన్య నిర్ణయాల కారణంగా బలవంతంగా విరామం తీసుకోవాల్సి వస్తే, ఆ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో తెలుసుకోవాలంటున్నారు. అదే సమయంలో అనుభవం, అర్హతలకు సరిపోయే ఉద్యోగాల కోసం కూడా సెర్చ్‌చేయాలని చెబుతున్నారు. ఈ సమయంలో ఉద్యోగ వేటలో ఆలస్యం చేయకుండా చూసుకోవడం చాలా ముఖ్యమంటున్నారు.బ్యాలెన్స్ నిర్వహణ: కెరీర్ బ్రేక్ సమయంలో తగిన ఆర్థిక భద్రతను కలిగి ఉండడానికి, సేవింగ్స్ ఖాతాలో కనీసం ఆరు నెలల జీవన వ్యయాలకు సరిపడా డబ్బు ఉండాలంటున్నారు. ఇక్కడ సరైన సేవింగ్స్ అకౌంట్‌ను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యమంటున్నారు. అంటే ఎటువంటి



పరిమితులు లేకుండా డబ్బును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు, మెరుగైన వడ్డీ రేట్లు, జీరో-బ్యాలెన్స్ లేదా మినిమమ్‌బ్యాలెన్స్‌అవసరమయ్యే అనుకూల ఖాతాలు ఉండాలంటున్నారు. దేశంలో కొన్ని ప్రైవేటు బ్యాంకులు వివిధ వ్యక్తుల అవసరాలకు తగినట్లుగా అనేక రకాల సేవింగ్స్ ఖాతా పథకాలను అంది స్తున్నాయని, అవసరాలు, పరిస్థితులకు అనుకూలమైన ఖాతాను ఎంచుకోవడం మేలం టున్నారు.ఖర్చులు: కొన్ని అనుకోని పరిస్థితుల వల్ల స్వచ్ఛందంగా లేదా బలవంతంగా విరామంలో ఉన్నట్లయితే, స్థిర వ్యయాలను సాధ్యమైనంత తక్కువ స్థాయికి తీసుకురావడం మంచిదంటున్నారు. ఇందులో నెలవారీ సబ్‌స్క్రిప్షన్లు, ఔఅటఅ, టెలిఫోన్ బిల్లులు, జువీ×లు, ఇంటి అద్దె, స్కూల్‌ఫీజులు, మందులు వంటి తప్పనిసరి ఖర్చులను విశ్లేషించాలని చెబుతున్నారు. ఈ ఖర్చుల్లో మీ జీవనశైలికి సంబంధించిన ఖర్చులను తగ్గించుకుని, కేవలం అత్యవసరమైన అవసరాలకు మాత్రమే నిధులను కేటాయించాలని సూచిస్తున్నారు. ఖర్చులకు బడ్జెట్ రూపొందించుకోవడం ఒక మంచి అలవాటని, ప్రస్తుతం, బడ్జెట్ చూసుకోవడానికి సహాయపడే అనేక ఉచిత మొబైల్ అప్లికేషన్లు అందుబాటులో ఉన్నాయంటున్నారు. ఇతర ఆర్థిక లక్ష్యాల కోసం కేటాయించిన పెట్టుబడులు లేదా పొదుపు మొత్తాలను వినియోగించడం తెలివైన పని కాదంటున్నారు.

# "బిజినెస్ ప్లాన్" ఉందా

**పూచీకత్తు లేకుండానే రూ.1.25 లక్షల లోన్.ఏదైనా వ్యాపారం**

**ప్రారంభించాలనుకుంటున్నారా.షూరిటీ లేకుండా ఇలా "లోన్" పొందవచ్చు**



మన దేశంలో బ్యాంకులు, ఇతర బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు(ఎన్‌బీఎఫ్‌సీలు) రకరకాల లోన్లు ఇస్తుంటాయి. ఈ క్రమంలోనే చాలా మంది తమ తమ అవసరాలను బట్టి గోల్డ్ లోన్, హోమ్ లోన్ వంటివి తీసుకుంటుంటారు. అయితే, ఇలాంటి లోన్స్ ఏమైనా తాకట్టు పెడితేనే లభిస్తాయి. అయితే, కొంతమందికి బ్యాంకు క్రెడిట్ యాక్సెస్ ఉండదు. అలాగే, వార్షికాదాయం రూ.3 లక్షలు లేదా అంతకన్నా తక్కువగా ఉంటుంది. చిన్న చిన్న అవసరాలకు రుణాలు అవసరం పడుతాయి. అలాంటి సందర్భాల్లో వారి దగ్గర బ్యాంకుల్లో సెక్యూరిటీగా పెట్టడానికి నగలు, ఇతర ఆస్తులూ ఉండకపోవచ్చు. అలాంటి వారికోసమే "మైక్రో ఫైనాన్స్ రుణాలు" అందుబాటులో ఉన్నాయి. ఈ రుణాలను ఎలాంటి పూచీకత్తు లేకుండానే రూ.1.25 లక్షల వరకు పొందవచ్చు. మరి ఈ లోన్స్ ఎలా తీసుకోవాలితిరిగి ఎలా చెల్లించాలికాల పరిమితి ఎంతఅర్హతలు ఏంటిపూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.చిన్న వ్యాపారులకు, పిల్లల స్కూల్ ఫీజులు, అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు కావాలంటే ఈ మైక్రో ఫైనాన్స్ లోన్స్ తీసుకోవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) రూల్స్ ప్రకారం ఈ రుణాలకు ఎలాంటి సెక్యూరిటీ, పూచీకత్తు అవసరం ఉండదు. మొత్తంగా రూ.1.25 లక్షల వరకు ఈ మైక్రో ఫైనాన్స్ లోన్ పొందవచ్చంటున్నారు నిపుణులు.కనీస లోన్ ఎంత మైక్రో ఫైనాన్స్ లోన్ కనీసం రూ.10 వేల నుంచి లక్షా 25 వేల రూపాయల వరకు ఇస్తారు. కొన్నిసార్లు ఈ లోన్ లిమిట్ కాస్త ఎక్కువగా కూడా ఉండొచ్చు. లోన్ టెన్యూర్ సాధారణంగా ఏడాది నుంచి మూడేళ్ల వరకు ఉంటుంది. ఒకవేళ లోన్ ముందుగానే చెల్లించాలనుకున్నా ఎలాంటి ప్రీ క్లోజర్ ఛార్జీలు ఉండవు. వారానికి, పదిహేను రోజులకు, నెలవారీగా లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించే వెసులుబాటు ఉంటుంది. లోన్ మంత్లీ ఈఎంఐ కుటుంబ ఆదాయంలో 50శాతం మించకుండా చూసుకోవాలి.వడ్డీ రేట్ల సంగతేంటి మైక్రో ఫైనాన్స్ లోన్ల వడ్డీ రేట్లను రుణాలు ఇచ్చే సంస్థలే నిర్ణయిస్తాయి. అయితే, ఆర్‌బీఐ గైడలైన్స్‌ఆయా సంస్థలు అధిక వడ్డీని వసూలు చేయడానికి వీలు లేదని పేర్కొంటున్నాయి. రిస్క్ నిధుల ఖర్చు, రిస్క్ ప్రీమియం, మార్జిన్ ఆధారంగా వడ్డీ రేట్లను ఆయా సంస్థల బోర్డ్ నిర్ణయిస్తుంది. ఈ వడ్డీ రేట్లు అత్యధికంగా 25 శాతం వరకు ఉంటాయని నివేదికలు చెబుతున్నాయి.కోటీశ్వరులను చేసే సీక్రెట్ ఫార్ములా పవర్ ఇదే లోన్స్ ఎవరు ఇస్తారు. మైక్రో ఫైనాన్స్ లోన్స్ ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోని బ్యాంకులు, చిన్న తరహా బ్యాంకులు, ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు(బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు), ఎన్‌బీఎఫ్‌సీ-ఎమ్ఎఫ్ఐలు ఇస్తాయి. ఇవి మాత్రమే కాకుండా సహకార బ్యాంకులు, సహకార సంస్థలు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్(రాஐ+ం), ఎన్‌జీఓలు, కమర్షియల్ పేమెంట్ బ్యాంకులు కూడా ఈ మైక్రో ఫైనాన్స్ రుణాలను ఇస్తాయని చెబుతున్నారు నిపుణులు.లోన్‌కు ఎవరు అర్హులు మైక్రో ఫైనాన్స్ రుణాలు పొందాలంటే ఆ వ్యక్తి భారతీయ పౌరుడై ఉండాలి.ఈ లోన్ తీసుకోవాలనుకుంటున్న వారి వార్షిక కుటుంబ ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉండాలి.అలాగే, అభ్యర్థి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి.లోన్ కావాల్సిన వ్యక్తికి క్లీన్ క్రెడిట్ కార్డు హిస్టరీ అవసరమనేది గుర్తుంచుకోవాలి.అత్యవసర పరిస్థితుల్లో వివిధ అవసరాల నిమిత్తం లోన్ కావాలనుకునే వ్యక్తి ఇలా సింపుల్‌గా రూ.1,12 లక్షల వరకు బ్యాంకు నుంచి రుణం పొందవచ్చని చెబుతున్నారు నిపుణులు.

# సుకన్య సమృద్ధి స్కీమ్ ద్వారా రూ.50 లక్షలు పొందాలా

**నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలంటే**

**ఆడపిల్లలకు నిధి కూడబెట్టాలనుకునే తల్లిదండ్రులకు వరంగా సుకన్య సమృద్ధి యోజన**

**ఖాతా ప్రారంభించి 21 ఏళ్లు పూర్తయిన తర్వాత అసలుం వడ్డీ మొత్తాన్ని తీసుకోవచ్చు**



కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చింది. అందులో "సుకన్య సమృద్ధి యోజన" ఒకటి. అత్యధిక వడ్డీ, ఎలాంటి పన్నూ లేని ఈ పథకం ఆడపిల్లల భవిష్యత్ అవసరాల కోసం పెద్ద మొత్తంలో నిధి కూడబెట్టాలనుకునే తల్లిదండ్రులకు ఓ వరం అని చెప్పొచ్చు. చక్రవడ్డీ ప్రయోజనమే దీనికి కారణం. మరి ఈ పథకానికి ఎవరు అర్హులు నెలకు ఎంతెంత జమ చేయాలి? రూ.50 లక్షలు పొందాలంటే ఏమి చేయాలి అనే పూర్తి వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.ఆడపిల్లల సంక్షేమం కోసం 2015లో కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. "బేటీ బచావో.. బేటీ పడావో" ఇనిషియేటివ్‌లో భాగంగా దీనిని ప్రవేశపెట్టింది. ఆడపిల్లలపై చదువులు, వివాహానికి అయ్యే ఖర్చులు తీర్చే ఉద్దేశంతో.. వారి తల్లిదండ్రులు పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించడమే ఈ స్కీమ్ లక్ష్యం.ఈ పథకానికి సంబంధించిన మరిన్ని వివరాలు అప్పుడే పుట్టిన శిశు వు నుంచి 10 సంవత్సరాల లోపు వయసు గల బాలికల పేరు మీద ఎప్పుడైనా ఈ స్కీమ్ కింద అకౌంట్ ఓపెన్ చేయవచ్చు.ఒక కుటుంబంలోని ఇద్దరు బాలికలకు ఈ పథకం వర్తిస్తుంది. అయితే ఓకే కాన్పులో ఇద్దరూ లేదా ముగ్గురు పిల్లలు పుట్టినప్పుడు మినహాయింపు లభిస్తుంది.ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.250 నుంచి రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టొచ్చు. అకౌంట్ ఓపెన్ చేసినప్పటి నుంచీ 15 ఏళ్ల వరకు డబ్బులు చెల్లించాలి. ఆ తర్వాత ఆరేళ్లపాటు ఎలాంటి డబ్బులు కట్టనవసరం లేదు. కానీ మీరు పెట్టిన పెట్టుబడిపై వడ్డీ వస్తుంది.బాలిక వయసు 18 పూర్తైన తర్వాత ఉన్నత చదువుల కోసం 50 శాతం విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.ఈ స్కీమ్‌లో పెట్టుబడులు పెట్టి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత అసలుం వడ్డీ మొత్తాన్ని తీసుకోవచ్చు.ఎంత పెట్టుబడి పెడితే ఎంత లభిస్తుంది: ఈ పథకంపై ప్రస్తుతం 8.2 శాతం వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎఫ్‌డీ, ఇతర ప్రభుత్వ స్కీమ్స్‌తో పోలిస్తే ఇందులోనే అత్యధిక వడ్డీ లభిస్తోంది. పథకంలో చేరినప్పటి నుంచే ప్రతి సంవత్సరం గరిష్ఠ పరిమితి ప్రకారం రూ.1.50 లక్షలు చొప్పున 15 ఏళ్ల పాటు ఇన్వెస చేస్తే 21 సంవత్సరాలకు రూ.70 లక్షలు అవుతుంది. ఇందులో కట్టేది కేవలం రూ.22.5 లక్షలు మాత్రమే. మిగిలిన రూ.40 లక్షలు వడ్డీ రూపంలోనే లభిస్తుంది.మీ లక్ష్యానికి అనుగుణంగా: ప్రతి సంవత్సరం రూ.లక్షన్నర చెల్లించలేని వారు వీలును బట్టి పెట్టుబడులు చేసుకుంటూ వెళ్లడం మంచిది. నెల లేదా ఏడాదికోసారి ఈ అమౌంట్‌ను అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. భవిష్యత్ అవసరాలకు ఎంత నిధి కావాలో అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టాలి. ఉదాహరణకు మీ పాప పేరు మీద రూ.10 లక్షల నిధి కూడబెట్టాలనుకుంటే మొదటి నుంచే నెలకు రూ.1800 లేదా ఏడాదికి రూ.20వేల చొప్పున ఇన్వెస చేయాలి. ఒకవేళ రూ.25 లక్షలు కావాలనుకుంటే నెలకు రూ.4,500 లేదా ఏడాదికి రూ.52 వేలు జమ చేయాలి.50 లక్షలు పొందడం ఎలా: రూ.50 లక్షలు రావాలంటే ప్రస్తుతం ఉన్న 8.2% వడ్డీ రేటు ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు రూ.1 లక్షా 10 వేల వరకు చెల్లించాలి. అంటే నెలకు రూ.9,200చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ స్కీమ్‌లో వడ్డీరేట్లు అనేవి ప్రతి 3 నెలలకు ఓసారి మారుతుంటాయి. పైన చెప్పిన లెక్కలు మొత్తం ప్రస్తుత వడ్డీ రేటును అనుసరించి లెక్కించినవే. వడ్డీ రేట్లలో మార్పులుంటే లెక్కల్లో మార్పు వస్తుందనే విషయం గమనించాలి.కావాల్సిన డాక్యుమెంట్స్ అమ్మాయి బర్త్ సర్టిఫికెట్ తల్లిదండ్రులు/సంరక్షకుల గుర్తింపు కార్డు, పాన్ కార్డు బాలిక, తల్లిదండ్రుల పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అకౌంట్ ఎలా ఓపెన్ చేయాలి: ఈ ఖాతాను సమీపంలోని పోస్టాఫీసు లేదా ప్రభుత్వ/ ప్రైవేటు బ్యాంకుల్లో ఓపెన్ చేయవచ్చు. అప్లికేషన్‌తోపాటు కనీస డిపాజిట్ రూ.250 చెల్లించాలి. ఈ పథకంలో పొదుపు చేయడం ద్వారా ప్రతి సంవత్సరం రూ. లక్షన్నర వరకు పన్ను మినహాయింపు పొందొచ్చు.

# ‘ది ప్యారడైజ్’తో నాని కొత్త రికార్డు.. ప్రీ రిలీజ్ బిజినెస్‌లో కెరీర్ బెస్ట్!



నేచురల్ స్టార్ నాని మార్కెట్ రోజురోజుకూ విస్తరిస్తుండగా, ఆయన నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘ది ప్యారడైజ్’ విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. థియేట్రికల్ హక్కుల వ్యాపారంలో ఈ సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ నమోదు చేసిన చిత్రంగా నిలిచే దిశగా దూసుకెళ్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్ రూ.82 కోట్ల నుంచి రూ.84 కోట్ల వరకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో నాని మార్కెట్ స్థాయి మరో మెట్టుకు చేరిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.వీశీజఱవం సినిమా నైజాం థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుమారు రూ.37 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందంలో రికవరీ క్లాజ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ డీల్‌లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ, నిర్మాత సుధాకర్ చెరుకూరి భాగస్వాములుగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. నైజాం ప్రాంతంలోనే ఈ స్థాయి బిజినెస్ జరగడం నాని కెరీర్‌లో అరుదైన మైలురాయిగా భావిస్తున్నారు. కోస్తాంధ్ర హక్కుల కోసం కూడా డిస్ట్రిబ్యూటర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు సమాచారం. అక్కడ కూడా సుమారు రూ.35 కోట్ల స్థాయిలో బిజినెస్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు రాయలసీమ (సీడెడ్) హక్కుల విషయంలో నిర్మాతలు రూ.12 కోట్ల నాన్-రిఫండబుల్ అడ్వాన్స్ కోరుతున్నట్లు తెలుస్తోంది. పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపుతున్నప్పటికీ, తుది ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో నాని నటించిన ‘హిట్ 3’ సినిమా సుమారు రూ.40 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్‌తో ఆయన కెరీర్‌లో అత్యధిక రికార్డు సృష్టించింది. ఇప్పుడు ‘ది ప్యారడైజ్’ ఆ సంఖ్యను దాదాపు రెట్టింపు చేస్తూ కొత్త బెంచ్‌మార్క్‌ను నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ‘దసరా’, ‘సరిపోదా శనివారం’ వంటి వరుస విజయాలతో నాని పాన్ ఇండియా మార్కెట్ మరింత బలపడిందని ఈ బిజినెస్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ‘ది ప్యారడైజ్’ ను సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. విడుదలకు ఒక రోజు ముందు అంటే సెప్టెంబర్ 23న ఇండియా, ఓవర్సీస్ మార్కెట్లలో ప్రత్యేక ప్రీమియర్ షోలను కూడా నిర్వహించనున్నట్లు సమాచారం.



# వీళ్లకు వయసు పెరుగుతోందా? తగ్గుతోందా?

డైట్, గ్లామర్ మెంటైన్ చేయాలంటే సామాన్యులకు కష్టం గానీ సెలబ్రిటీలకు చాలా సింపుల్. ఎందుకంటే కొందరు 50-60 ఏళ్లొచ్చినా సరే యంగ్‌గా కనిపిస్తూ మెస్మరైజ్ చేస్తుంటారు. ఇప్పుడు సెలబ్రిటీ జంట సూర్య-జ్యోతిక కూడా అలానే షాకిచ్చారు. వీళ్లు కలిసి దిగిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత 30 ఏళ్లుగా నటుడిగా చేస్తున్న సూర్య.. ‘విశ్వనాథ్ అండ్ సన్స్’తో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. వచ్చే వారం ఈ మూవీ థియేటర్లలోకి రానుంది. దీని ప్రమోషన్లలో ఓ పక్క బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు భార్యతో కలిసి ఓ మ్యాగజైన్ కోసం ఫొటోషూట్‌లో పాల్గొన్నాడు. బ్లాక్ అండ్ వైట్, కలర్ గ్రేడింగ్‌తో ఉన్న ఈ ఫొటోల్లో డిజైనర్ దుస్తుల్లో వీళ్లిద్దరూ కనువిందు చేశారు. ఇవి చూసిన చాలామంది వీళ్లకు వయసు తగ్గుతోందా? అని మాట్లాడుకుంటున్నారు. సూర్య సినిమాలతో బిజీగా ఉండగా జ్యోతిక కూడా సెకండ్ ఇన్నింగ్స్‌లో హిందీలో మూవీస్ చేస్తోంది. కొన్నాళ్ల క్రితం ఈమె ‘సిస్టమ్’ అనే వెబ్ సిరీస్ చేసింది. తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతున్న దీనితో సక్సెస్ అందుకుంది.

# ‘అగధ’ ట్రైలర్ విడుదల.. మంత్ర తంత్రాల రహస్యాలతో ఉత్కంఠ రేపుతున్న ఎంఎస్ రాజు!




ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ ‘అగధ’ ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ఞూ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. “మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది... దాని గురించి నాకు తెలియాలి” అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ‘అగధ’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.

# నాని సమర్పణలో నితిన్ కొత్త చిత్రం

## ‘అలియాస్ రుక్మిణీ’ టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి రేపిన మేకర్స్!

హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి ‘అలియాస్ రుక్మిణీ ’ అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ‘గరం గోపాల్’, ‘ఆమెకు ఆమెంటే ఇష్టం’, ‘వత్రం వెంకన్న’ వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా ‘రుక్మిణి’ అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది.ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ “ఆమె నా భార్య” అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత క్యూరియాసిటీ పెరిగింది. ‘అలియాస్ రుక్మిణి’ అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది. నితిన్ కెరీర్‌లో ఇది మరో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం అని తెలుస్తోంది. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో మేకర్స్ చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది.నాని సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో నాని నిర్మాణంలో వచ్చిన పలు చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ కూడా పొందాయి. దీంతో ‘అలియాస్ రుక్మిణి’ కూడా కంటెంట్ ఆధారిత చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. త్వరలోనే హీరోయిన్, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం ప్రకటించనుంది. టైటిల్ గ్లింప్స్‌తోనే ఆసక్తిని పెంచిన ‘అలియాస్ రుక్మిణి’ ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.